
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
ఆదివారం, 15.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 143
పేజీలు: 12 వెల: రూ. 5

## అంజన్న ఆశీర్వాద యాత్ర

కొండగట్టు ఆశీర్వాద యాత్రలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలపై బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు!

### 11 గంటల్లో 40 కి.మీలు నడిచిన కేంద్రమంత్రి



- మండుటెండను సైతం లెక్క చేయకుండా కొండగట్టుకు
- మధ్యాహ్న భోజనం వద్ద ఒకసారి, తేనెటీగ దాడి సమీపంలో మరోసారి సేదదీరిన కేంద్ర మంత్రి
- సంజయ్ తో కలిసి అడుగులో అడుగు వేస్తూ నడిచిన కాషాయ శ్రేణులు
- దిగ్విజయంగా ముగిసిన 'అంజన్న ఆశీర్వాద యాత్ర
- కరీంనగర్ నుండి కొండగట్టు దాకా.. కాషాయ శ్రేణుల సందడి

03

కాంగ్రెస్‌కు షాక్?

## బీఆర్ఎస్ వైపు జీవన్ రెడ్డి అడుగులు!

హస్తంలో జీవన్ రెడ్డి వివాదం



- సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరికతో పెరిగిన అసంతృప్తి
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో భేటీకి రంగం సిద్ధం
- అనుచరులతో వరుస సమావేశాలు.. పార్టీ మార్పుపై అభిప్రాయ సేకరణ

09



డిజిటల్ ఎకానమీగా మారేందుకు

## సహకరిస్తాం

మంత్రి శ్రీధర్ బాబు

- టాంజానియా ఉన్నత స్థాయి బృందం భేటీ
- కీలక రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామిగా 'తెలంగాణ'
- ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ఏర్పాటు సాధ్యసాధ్యాలపై అధ్యయనం

03

పెళ్లికి నిరాకరించిందని..

## యువతికి హెచ్ఐవీ ఇంజెక్షన్

రాంబాయి సినిమా సీన్ రిపీట్

- ఓ యువకుడి దారుణం
- మేడ్చల్-మల్కాజ్ గిరిలో ఘటన

03




యుద్ధం..

## రూ.23.44 లక్షల కోట్లు ఆవిరి

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో స్టాక్ మార్కెట్లకు రూ.23.44 లక్షల కోట్ల నష్టం

- మార్కెట్లలో నిత్యం బ్లడ్ బాత్
- యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి బేర్ బోర్
- వార్ త్వరగా ముగియాలన్న ఇన్వెస్టర్లు
- 15 రోజులుగా కొనసాగుతున్న యుద్ధం

10



## పెరుగుతున్న ఎఫైర్లు!

కాంచీపురం అగ్రస్థానం

వివాహేతర సంబంధాల్లో దేశంలో హైదరాబాద్ కు 11వ స్థానం



- డేటింగ్ యాప్ సర్వేలో ఆసక్తికర నిజాలు
- మెట్రోల నుంచి చిన్న పట్టణాల దాకా వ్యాప్తి
- టాప్-20లో ముంబైకి చోటు లేక ఆశ్చర్యం
- డేటింగ్ యాప్‌లతో రహస్య సంబంధాలు

ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల ఆధిపత్యం 09

*ప్రేమంటే రెండు మనసుల కలయిక అని ఒకప్పుడు అనుకునేవాళ్లం.. కానీ మారుతున్న కాలం.. ఆధునిక జీవనశైలి ఇప్పుడు ఆ బంధాల నిర్వచనాలనే మార్చేస్తున్నాయి. నలుగురు చూస్తారన్న భయం లేదు, సమాజం ఏమనుకుంటుందో అన్న సంకోచం లేదు.. కేవలం 'ప్రైవసీ' ముసుగులో కొత్త ప్రపంచాలను వెతుక్కుంటూ, వివాహ బంధంలోని పవిత్రతను దాటి కొత్త ఆకర్షణల వైపు అడుగులు వేస్తున్నారు నేటి తరం. కాంచీపురం నుంచి భాగ్యనగరం వరకు.. దేశమంతటా ఇప్పుడు ఇదే కొత్త చర్చ! ఇంతకీ ఈ 'రహస్య ఆకర్షణల' వెనుక ఉన్న అసలు కారణం ఏంటి? అసలు ఈ బంధాల పర్వం ఎటువైపు దారితీస్తోంది?*

# రాజకీయ రణక్షేత్రంగా మూసీ

## నాటి నుంచి నేటి వరకూ అదే వరుస

### రేవంత్ సర్కార్ ముందుకు సాగేనా?

- మూసీ సుందరీకరణ.. ముందుకా..వెనక్కా..?
- ముందుంది నిర్వాసితుల గండం
- కోర్టు కేసులను అధిగమించేనా?
- ఏళ్లకేళ్లుగా హామీల్లో నలుగుతున్న ప్రక్షాళన
- 1997 నుంచి సాగుతున్న శుద్ధి ప్రాజెక్టు
- రబ్బర్ డ్యాం ఏర్పాటుతో ఆపేసిన వైఎస్సార్
- 20 ఎస్టీపీలను నిర్మించిన కేసీఆర్
- నిధుల లేమితో అటకెక్కిన ప్రాజెక్టు
- రేవంత్ హయాంలో సరికొత్త పాలసీ



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్ నగర హృదయంగా భావించే మూసీ నది ఇప్పుడు మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన అంశంగా మారింది. 'గాంధీ సరోవర్ – మూసీ సుందరీకరణ' ప్రాజెక్టుతో ప్రభుత్వం ముందుకు వస్తుండగా ప్రతిపక్షాలు దీనిపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ఒకవైపు బీఆర్ఎస్, బీజేపీ ఈ అంశాన్ని ప్రజా సమస్యగా మార్చేందుకు ప్రయత్నిస్తుండగా, మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి అజెండాగా చూపిస్తూ ముందుకు సాగుతోంది. మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో గత మూడు దశాబ్దాలుగా పలు ప్రణాళికలు వచ్చినప్పటికీ, అవి పూర్తిగా అమలుకాలేదు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన కొత్త ప్రణాళిక ఈ దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపుతుందా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**నిర్వాసితుల సమస్య ప్రధాన అడ్డంకి**

మూసీ పరివాహక ప్రాంతంలోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించే ప్రక్రియపై స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారులు వరద నివారణ, నగర అభివృద్ధి కోసం ఈ చర్యలు అవసరమని చెబుతున్నప్పటికీ, తమ ఇళ్లను కూల్చివేస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్, బీజేపీ రాజకీయంగా వినియోగిస్తున్నాయి. బాపూఘాట్ సమీపంలో ప్రపంచంలోనే అతిపెద్ద మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆ ప్రాంతాన్ని 'గాంధీ సరోవర్'గా మిగతా 02లో

## బాధితుల గోస చూడండి

మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

- మూసి పునరుజ్జీవనం చేయాలి
- మూసీ విషజలాలకు 40 లక్షల మంది బాధితులు
- నల్లగొండ ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచించండి
- ప్రజల ఆరోగ్యం కోసం చేస్తున్న మంచి పనిని ప్రతిపక్షాలు రాజకీయం చేయొద్దు
- అభివృద్ధి, ప్రజా సంక్షేమమే మా ప్రధాన ఎజెండా

03



## విద్యమీదే ఫోకస్

### వచ్చే ఏడాది నుంచి కొత్త ప్లాన్

### విద్యార్థులకు రేవంత్ గిఫ్ట్

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కీలక నిర్ణయాలు
- వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి విద్యార్థులకు బస్ ప్రయాణంలో రాయితీలు
- నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే క్యాంపస్‌లో విద్యా విధానం




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలో కొత్త విద్యా విధానం అమలు కానుంది. విద్యా విధానంలో సీఎం రేవంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలతో పాటుగా విద్యార్థులకు సదుపాయాలు పెంచడం పైన ఫోకస్ చేశారు. పాఠశాలలను అప్ గ్రేడ్ చేయటం పైన కీలక దిశా నిర్దేశం చేసారు. అదే విధంగా విద్యార్థినుల కోసం కొత్త వరాలు ప్రకటించారు. వచ్చే వారం తెలంగాణ బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నారు. అందులో రేవంత్ ప్రభుత్వం వీరి కోసం కొత్త నిర్ణయాల అమలు దిశగా కీలక ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది.

**అవే కీలకం**

ముఖ్యమంత్రి రేవంత్ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం మిగతా 02లో

## ఖమేనీ ఆచూకీ చెప్తే రూ. 92 కోట్లు

10

ఇరాన్ ప్రజలకు ట్రంప్ బిగ్ ఆఫర్

అమెరికాలో స్థిరనివాసం కూడా



## రియల్ బూమ్ పెంచే ప్లాన్

చిన్న పట్టణాల చుట్టూరా రింగ్ రోడ్స్

- జిల్లా కేంద్రాల అభివృద్ధికి కొత్త రోడ్ మ్యాప్
- భారీ వాహనాల ట్రాఫిక్‌కు చెక్.. పట్టణాల్లో ప్రయాణం సులువు
- జాతీయ రహదారులకు అనుసంధానం.. రేడియల్ రోడ్లతో కనెక్టివిటీ పెంపు
- శివారు భూములకు డిమాండ్ పెరుగుతుందా?



- రియల్ ఎస్టేట్ రంగంలో ఆశలు
- ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ తరహాలో జిల్లాల్లోనూ రింగ్ రోడ్లకు ప్రభుత్వ ప్రణాళిక
- త్వరలోనే రేవంత్ టీం నయా ప్లాన్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలోని చిన్నచిన్న పట్టణాల్లో కూడా రియల్ బూమ్ రావడం ఖాయంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకుంటున్న నిర్ణయాలు రియల్ ఎస్టేట్ రంగానికి ఊపు ఇచ్చేలా ఉన్నాయి. కొన్ని పట్టణాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి ఊపునిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రాజధాని హైదరాబాద్ చుట్టూ ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు ఉంది. అయినప్పటికీ రీజనల్ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ రింగ్ రోడ్స్ కారణంగా శివారు ప్రాంతాల్లో రియల్ బూమ్ ఏ స్థాయికి చేరుకుందో చూస్తున్నాం. ఇప్పుడు ఇదే తరహాలో జిల్లా కేంద్రాల చుట్టూ రింగ్ రోడ్స్ నిర్మించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోంది. అంటే ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మిగతా 02లో

## యుద్ధం వేళ విదేశీయులకు ఊరట

వీసా గడువు ముగిసినా నెల రోజులు ఉండేందుకు అనుమతి


- యుద్ధం ముగిసిన వెంటనే ఎగ్జిట్ పర్మిట్లు
- భారత్ నిర్ణయంపై సర్వత్రా హర్షం

10



నడి ఏడి మరో

పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పొదుపు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ రంగ, స్వయం ప్రతిపత్తి సంస్థల ఉద్యోగుల వేతనాల్లో 5 నుంచి 30 శాతం కోత విధించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 15.03.2026
www.mudranews.in | @mudranews



**నెమ్మదిగా తినే అలవాటు చేసుకోండి**



త్వరగా తినడం వల్ల గాలి ఎక్కువగా మింగి గ్యాస్ సమస్య వస్తుంది. కాబట్టి ఆహారాన్ని బాగా నమిలి నెమ్మదిగా తినడం మంచిది.

## రియల్ బూమ్ పెంచే ప్లాన్

(మొదటి పేజీతరువాయి)

పరిసరాల్లో మాదిరిగానే జిల్లా కేంద్రాల శివార్లలో భూములకు రెక్కలు రానున్నాయి.. రియల్ ఎస్టేట్ ఊపందుకోనుంది.

**రేవంత్ సర్కార్ ప్లాన్ ఇదే..**

రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా ఈ రింగ్ రోడ్స్ ఉపయోగపడతాయని... తద్వారా సరుకు రవాణా వేగం పెరుగుతుందని అన్నారు. అంతేకాదు పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గుతాయని... తద్వారా ప్రజల ప్రయాణ సమయం కూడా తగ్గుతుందని అన్నారు. ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో జాతీయ రహదారులు ఉంటే వాటిని అనుసంధానించేలా రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. జిల్లా కేంద్రాల నుంచి రింగు రోడ్లకు అనుసంధానించేలా రేడియల్ రోడ్లు నిర్మించాలని సీఎం ఆదేశించారు. జాతీయ రహదారులకు రింగు రోడ్లను అనుసంధానించే అంశంపై ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**రియల్ ఎస్టేట్ ఊపందుకుంటుందా..?**

ప్రస్తుతం తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందనే చెప్పాలి. గతంలో పంటలు పండే వ్యవసాయ భూములు కాదు బీడు, రాళ్లు, కొండకోన ప్రాంతాల్లోని భూములు కూడా లక్షలు, కోట్లు పలికాయి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు.. ధరలు సగానికి సగం పడిపోయాయి. దీంతో భూములు అమ్మేవారు, కొనేవారు సైలెన్స్ అయిపోయారు.. రియల్ ఎస్టేట్ నెమ్మదించింది. ఈ క్రమంలో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ కు బూస్ట్ ఇచ్చేలా నిర్ణయాలు తీసుకుంటోంది... అందులో భాగమే ఈ జిల్లా కేంద్రాల చుట్టూ రింగ్ రోడ్స్ ప్రతిపాదన. భవిష్యత్ లో తెలంగాణ జిల్లా కేంద్రాల్లో రియల్ భూమ్ ఖాయంగా కనిపిస్తోంది.

## కాలేజీ బస్సును ఢీకొట్టిన గూడ్సు

### 23 మందికి తీవ్రగాయాలు

**ముద్ర న్యూస్ :**

రైల్వే లెవల్ క్రాసింగ్‌ను దాటేందుకు ప్రయత్నించిన కళాశాల బస్సును గూడ్సు రైలు ఢీకొట్టింది. తమిళనాడులోని కరూర్ జిల్లా లో జరిగిన ఈ ఘటనలో 23 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. తాంతోణి సమీపాన ఉన్న ఓ ప్రైవేటు కళాశాలకు చెంది న బస్సు విద్యార్థులతో బయలుదేరింది. శనివారం సాయంత్రం వెళ్లియణై వద్ద కుళత్తూర్‌లోని మానవరహిత రైల్వే లెవెల్ క్రాసింగ్ ను దాటేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో వేగంగా వచ్చిన గూడ్సు రైలు ఆ బస్సును ఢీకొట్టింది.

ఈ ఘటనలో బస్సు వెనుక భాగం ధ్వంసం కావడంతో 23 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే సహాయ క చర్యలు చేపట్టారు. అంబులెన్సుల ద్వారా క్షతగాత్రుల్లో 21 మందిని కరూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి, ఇద్దరిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను క రూర్ ఎంపీ జ్యోతిమణి, మాజీ మంత్రి సెం థిల్ బాలాజీ తదితరులు పరామర్శించారు. దిండుక్కల్ జిల్లా కరికాళిలోని రాళ్ల క్వారీ నుంచి పులియూర్‌లోని ప్రైవేటు సిమెంట్ కర్మాగారానికి కంకర లోడును గూడ్సు రైలు తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.



# విద్యమీదే ఫోకస్



(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ.. విద్యా వ్యవస్థను ప్రక్షాళన దిశ గా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా విద్యార్థుల కోసం రవాణా, భోజనం, నూతన విద్యా విధానంపై కీలక హామీలు ఇచ్చారు. వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి ప్రభుత్వ పాఠ శాల విద్యార్థులకు ఉచితంగా లేదా 50 శాతం రాయితీతో బస్సు రవాణా సౌకర్యాన్ని కల్పించాలని డిసైడ్ అయ్యారు. ఈ మేరకు బడ్జెట్ లో ప్రకటించే వీలుగా కసరత్తు జరుగుతోంది. అదే సమయంలో విద్యా వ్యవస్థలోనూ మార్పులు తెస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే చోట విద్యను అందించే విధానాన్ని అమలు చేయనున్నారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండి కాలేజీ స్థాయి వరకు వేర్వేరు చోట్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఒకే ప్రాంగణంలో చదువుకునేలా ఈ విధానాన్ని రూపొందించారు.

**కార్పొరేట్ ను తలదన్నేలా..! ప్రభుత్వం కొత్త ప్రణాళికలు**

కాగా, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ అత్యాధునిక మౌలిక సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్య అందించేలా కసరత్తు జరుగుతోంది. ఇక.. ఈ పబ్లిక్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం పూట పౌష్టికాహారంతో కూడిన టిఫిన్ కూడా ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సంస్కరణ కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. రవాణా సౌకర్యం కల్పించడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు ఉన్నత విద్య మరింత సులభతరం అవుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే వీటి అమలు దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# మనిషి వర్సెస్ మెషిన్.. యుద్ధం మొదలైందా?

## ఏఐ వైపు అడుగులు..

### ఖర్చుల తగ్గింపు దిశగా మార్క్ జుకర్‌బర్గ్ సంచలన నిర్ణయం?

**ముద్ర డెస్క్ :**

మనిషి వర్సెస్ మెషిన్.. యుద్ధం మొదలైందా? సోషల్ మీడియా సామ్రాజ్యాన్ని శాసిస్తున్న మెటా ఇప్పుడు తన రూటు మారుస్తోంది. ఏఐ రంగంలో అగ్రగామిగా నిలవాలన్న ఆశయం కోసం ఏకంగా 20 శాతం మంది సిబ్బందిని వదులుకోవడానికి సిద్ధపడటం టెక్ పరిశ్రమలో పెను సంచలనం సృష్టిస్తోంది. 600 బిలియన్ డాలర్ల ఏఐ సామ్రాజ్యాన్ని నిర్మించే క్రమంలో 16 వేల మంది ఉద్యోగులు బలికాబోతున్నారా? మెటా వేస్తున్న ఈ అడుగు భవిష్యత్తు టెక్నాలజీకి సంకేతమా లేక పెను ప్రమాదమా?

ప్రపంచ సోషల్ మీడియా దిగ్గజం మెటా ప్లాట్‌ఫామ్స్ మరోసారి వార్తల్లో నిలిచింది. అయితే ఈసారి అది ఏదో కొత్త ఫీచర్‌తోనో లేదా లాభాలతోనో కాదు.. వేలాది మంది ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే 'లేఆఫ్' వార్తలతో.. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం మెటా తన మొత్తం ఉద్యోగులలో దాదాపు 20 శాతం మందిని.. అంటే సుమారు 16,000 మందిని తొలగించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం సంస్థలో ఉన్న 79 వేల మంది సిబ్బందిపై ఈ ప్రభావం పడనుందని అంతర్జాతీయ మీడియా కథనాలు కోడై కూస్తున్నాయి.

**ఏఐ కోసం భారీ పునర్వ్యవస్థీకరణ**

మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ గత రెండేళ్లుగా కంపెనీని "ఇయర్ ఆఫ్ ఎఫిషియన్సీ" వైపు నడిపిస్తున్నారు. కంపెనీ తన పూర్తి ఫోకస్‌ను ఇప్పుడు జనరేటివ్ ఏఐ , మెటావర్స్ నుండి డేటా సెంటర్ల విస్తరణ వైపు మళ్లిస్తోంది. ఈ క్రమంలో అనవసరమైన విభాగాలను తొలగించడం లేదా కుదించడం ద్వారా వ్యయాలను తగ్గించుకోవాలని కంపెనీ భావిస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. కంపెనీ ఉన్నతాధికారులు ఇప్పటికే సీనియర్ లీడర్లతో సమావేశమై.. కార్యకలాపాలను ఎలా సరళీకృతం చేయాలో చర్చించారు. 2028 నాటికి సుమారు 600 బిలియన్ డాలర్లను ఏఐ మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేయాలని మెటా లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భారీ పెట్టుబడుల కోసం నిధులను సమకూర్చుకోవడానికి ఉద్యోగాల కోత తప్పనిసరని విశ్లేషకులు భావిస్తున్నారు.

**గత మూడేళ్లలో మూడోసారి..**

ఒకవేళ ఈ 16 వేల మంది తొలగింపు నిజమైతే గత మూడేళ్లలో మెటా చేపట్టిన మూడవ అతిపెద్ద లేఆఫ్ ఇదే అవుతుంది. 2022లో 11,000 మంది ఉద్యోగుల తొలగింపు చేపట్టారు. 2023లో 10,000 మంది ఉద్యోగుల తొలగింపు.. 2026 అంచనాలో 16,000 మంది ఉద్యోగుల తొలగింపు చేపట్టనున్నారు. మెటా ప్రతినిధి ఆండీ స్టోన్ ఈ వార్తలను కేవలం "ఊహాగానాలు" అని కొట్టిపారేసినప్పటికీ లోలోపల జరుగుతున్న పరిణామాలు మాత్రం ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

**టెక్ రంగంలో మారుతున్న సమీకరణాలు**

కేవలం మెటా మాత్రమే కాదు.. గూగుల్, అమెజాన్ , ఒరాకిల్ వంటి సంస్థలు కూడా ఇదే బాటలో పయనిస్తున్నాయి. అమెజాన్ ఇప్పటికే ఏఐ వ్యూహంలో భాగంగా 16 వేల మందిని తొలగించింది. ఓరాకిల్ కూడా తమ డేటా సెంటర్ల సామర్థ్యం పెంచేందుకు 20 నుంచి 30 వేల మందిని తగ్గించే యోచనలో ఉంది. మోర్గాన్ స్టాన్లీ వంటి ఆర్థిక సంస్థల విశ్లేషణ ప్రకారం ఏఐ వల్ల కొన్ని రకాల ఉద్యోగాలు ఆటోమేట్ అయినప్పటికీ అవి పూర్తిగా నిరుద్యోగానికి దారితీయవు. అయితే ఉద్యోగులు పాత నైపుణ్యాలకు స్వస్తి చెప్పి మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టెక్నాలజీ మారుతున్న కొద్దీ కంపెనీలు తమ ప్రాధాన్యతలను మార్చుకోవడం సహజం. కానీ లాభాల్లో ఉన్న కంపెనీలు కూడా ఏఐ పేరుతో వేలాది మందిని రోడ్డున పడేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్త అమవుతున్నాయి. భవిష్యత్తులో కేవలం టెక్నికల్ స్కిల్స్ మాత్రమే కాకుండా ఏఐతో కలిసి పనిచేయగలిగే సామర్థ్యం ఉన్నవారికే ఉద్యోగ భద్రత ఉంటుందని స్పష్టమవుతోంది.






## రాజకీయ రణక్షేత్రంగా మూసీ

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే భూముల స్వాధీనం, పునరావాసం వంటి అంశాలు ఈ ప్రాజెక్టుకు సవాళ్లుగా మారాయి.

**మూసీ కాలుష్యం తీవ్ర స్థాయిలో..**

హైదరాబాద్ నగరంలో ఉత్పత్తి అవుతున్న మురుగునీటిలో దాదాపు 94 శాతం మూసీ నదిలోకి చేరుతోంది. రోజుకు సుమారు 1950 మిలియన్ గ్యాలన్ల మురుగునీరు ఉత్పత్తి అవుతుండగా, ప్రస్తుతం ఉన్న ఎస్టీపీలు దాదాపు 772 ఎంఎల్‌డీ నీటినే శుద్ధి చేస్తున్నాయి. మిగిలిన మురుగు నేరుగా నదిలో కలుస్తుండటంతో మూసీ తీవ్ర కాలుష్యానికి గురైంది.మూసీ కాలుష్యం ప్రభావం నల్లగొండ జిల్లా వరకు కనిపిస్తోంది. నదీ పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు కూడా కలుషితమవడంతో అక్కడి రైతులు పండించే పంటలకు మార్కెట్ లేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

**చంద్రబాబు హయాంలో..**

1997లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'మూసీ నందనవనం' ప్రాజెక్టును ప్రారంభించారు. నిర్వాసితుల కోసం నందనవనం కాలనీ నిర్మించినప్పటికీ ప్రాజెక్టు పూర్తిగా అమలుకాలేదు. చాదర్‌ఘాట్ ప్రాంతంలో నిర్మించిన కాంక్రీట్ కాలువ వరదలకు కొట్టుకుపోయింది.

**వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో..**

2005లో 'సేవ్ మూసీ క్యాంపెయిన్' చేపట్టి ఎస్టీపీలు, రబ్బర్ డ్యామ్‌లు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ నిధుల కొరత, సాంకేతిక సమస్యలతో ప్రాజెక్టు ముందుకు సాగలేదు.

**కేసీఆర్ ప్రభుత్వంలో..**

2017లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. రూ.16 వేల కోట్లతో సుందరీకరణ ప్రణాళిక రూపొందించారు. డ్రోన్ సర్వేలు కూడా చేశారు. అయితే నిధుల లేమితో పనులు పెద్దగా ముందుకు సాగలేదు.

**రేవంత్ రెడ్డి నయా ప్రణాళిక..**

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ అభివృద్ధిని రెండు దశల్లో అమలు చేయాలని నిర్ణయించింది. మొదటి దశలో బాపూఘాట్ నుంచి గండిపేట వరకు సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. దీనికి దాదాపు రూ. 6500 కోట్ల వ్యయం అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నుంచి రుణం పొందేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మూసీని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించింది.

**ప్రశ్నలతో ముగిసే మూసీ కథ**

గత మూడు దశాబ్దాలుగా మూసీ ప్రక్షాళనపై ఎన్నో ప్రణాళికలు వచ్చాయి. కానీ నది పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదు. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన కొత్త ప్రణాళిక నిజంగా మూసీ రూపురేఖలను మార్చుతుందా? లేక మరోసారి రాజకీయ హామీగానే మిగిలిపోతుందా? అనే ప్రశ్నలకు సమాధానం రానున్న రోజుల్లో తేలనుంది.

**ఇంకా ఎదురున్న సవాళ్లు**

మూసీ ప్రక్షాళనలో ప్రధాన అడ్డంకులున్నాయి. నిర్వాసితుల పునరావాసం.. కోర్టు కేసులు.. పర్యావరణ అనుమతులు.. భారీ నిధుల అవసరం ఉంది. ఈ సమస్యలు పరిష్కారం కానట్లయితే ప్రాజెక్టు మరోసారి నిలిచే ప్రమాదం ఉందని నిపుణులు చెప్తున్నారు.

## హర్మూజ్‌కు అమెరికా యుద్ధ నౌకలు

**ముద్ర డెస్క్:**

హర్మూజ్ జలసంధికి ఇరువైపులా వందలాది నౌకలు నిలిచిపోయినప్పటికీ.. దీనిని మూసే ఉంచుతామని ఇరాన్ హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. ఏదో ఒక విధంగా జలసంధికి త్వరలోనే స్వేచ్ఛ లభిస్తుందన్నారు. ఇరాన్ చర్యలతో ఇబ్బంది పడుతున్న దేశాలు హర్మూజ్‌కు యుద్ధ నౌకలు పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టు పెట్టారు. ''హర్మూజ్ జలసంధి నిర్బంధం వల్ల ప్రభావితమైన దేశాలు అమెరికాతో కలిసి యుద్ధ నౌకలను పంపిస్తున్నాయి. చైనా, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, యూకే తదితర దేశాలు ఇరాన్ వల్ల ఇబ్బంది పడ్డాయి. ఈ దేశాలు కూడా యుద్ధ నౌకలు పంపుతాయని ఆశిస్తున్నా. అంతలోపు మేం కూడా అక్కడి తీర ప్రాంతంపై దాడులు చేసి ఇరాన్ ఓడలను ముంచేస్తాం. ఏదో ఒక రకంగా హర్మూజ్ జలసంధికి త్వరలోనే స్వేచ్ఛ లభిస్తుంది'' అని ట్రంప్ పేర్కొన్నారు.



# 1,430 మిస్సైళ్లతో ఇరాన్ దాడి

## ఇజ్రాయెల్‌లో ఉద్రిక్త పరిస్థితులు

**ముద్ర డెస్క్ :**

మధ్యప్రాచ్యం మరోసారి అగ్నిగుండంగా మారింది. ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం ఇప్పుడు బహిరంగ ప్రత్యక్ష సైనిక ఘర్షణకు దారితీసింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ అత్యంత భారీ స్థాయిలో మిస్సెల్ దాడులకు దిగడంతో యావత్ ప్రపంచం ఉలిక్కిపడింది. నిమిషాల వ్యవధిలోనే వందల కొద్దీ క్షిపణులను ప్రయోగించడం ద్వారా ఇరాన్ యుద్ధాన్ని తారాస్థాయికి చేర్చింది.

**భయంకరమైన దాడి**

ఇజ్రాయెల్ అత్యవసర వైద్య సేవా సంస్థ 'మాగెన్ డేవిడ్ అడోమ్' వెల్లడించిన గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం కొద్ది నిమిషాల వ్యవధిలోనే ఇరాన్ సుమారు 1,430 క్షిపణులను ఇజ్రాయెల్ లక్ష్యంగా ప్రయోగించింది. ముఖ్యంగా దక్షిణ ఇజ్రాయెల్‌లోని ఈలట్ నగరాన్ని కేంద్రంగా చేసుకుని జరిగిన ఈ దాడులు.. ఆ ప్రాంత భద్రతా వ్యవస్థను పరీక్షించాయి. ఈలట్ నగరంలోని నివాస ప్రాంతాలు, కీలక మౌలిక వసతులపై క్షిపణులు పడటంతో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. పలు భవనాలు ధ్వంసమవ్వడమే కాకుండా కొన్ని ప్రాంతాల్లో భారీ అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా నివేదించింది.

**గాయపడిన పౌరులు.. అత్యవసర సేవలు**

దాడుల ధాటికి పలువురు పౌరులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన పారామెడికల్ బృందాలు, క్షతగాత్రులను యుద్ధ ప్రాతిపదికన సమీప ఆసుపత్రులకు తరలించాయి. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు నిరంతరం చికిత్స అందిస్తున్నారు. సైరన్ల మోతతో భయాందోళనకు గురైన ప్రజలను ఇజ్రాయెల్ ప్రభుత్వం తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, బంకర్లకు తరలించే ప్రక్రియను వేగవంతం చేసింది.

**ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ.. ప్రతిస్పందన**

ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించాయి. తమ దేశ రక్షణ



కోసం 'ఐరన్ డోమ్' వంటి అధునాతన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లను పూర్తిస్థాయిలో రంగంలోకి దించాయి. ఇరాన్ ప్రయోగించిన మిస్సెళ్లలో అత్యధిక భాగాన్ని గాల్లోనే అడ్డుకుని నిర్వీర్యం చేసినట్లు రక్షణ అధికారులు ప్రకటించినప్పటికీ కొన్ని క్షిపణులు డిఫెన్స్‌ను ఛేదించుకుని లక్ష్యిత ప్రాంతాల్లో పడటం ఆందోళన కలిగిస్తోంది. ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆగ్రహంతో ఉంది. తగిన సమయంలో బదులిస్తామని హెచ్చరిస్తోంది.

**అంతర్జాతీయ ఆందోళన**

ఈ ఘటన మధ్యప్రాచ్య భౌగోళిక రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలుకుతోందని అంతర్జాతీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఈ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలపై, భద్రతా పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఐక్యరాజ్యసమితి, పలు అగ్రరాజ్యాలు ఇరుపక్షాలు సంయమనం పాటించాలని తక్షణమే శాంతి చర్చలు ప్రారంభించాలని పిలుపునిచ్చాయి. అయితే పరిస్థితిని బట్టి చూస్తుంటే యుద్ధం మరింత ముదిరే ప్రమాదం కనిపిస్తోంది. ఇది కేవలం రెండు దేశాల మధ్య సమస్యగా కాకుండా ప్రాంతీయ యుద్ధంగా మారే అవకాశం ఉండటంతో ప్రపంచం మొత్తం ఈ పరిణామాలను అత్యంత ఆందోళనతో గమనిస్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
15.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**కార్బొనేటెడ్ డ్రింక్స్ తగ్గించండి**

సోడా, కోల్డ్‌డ్రింక్స్ వంటి గ్యాస్ ఉన్న పానీయాలు కడుపులో గ్యాస్ పెంచుతాయి. వీటి బదులు నీరు లేదా సహజ పానీయాలు తీసుకోవడం మంచిది.





### డిజిటల్ ఎకానమీ'గా మారేందుకు

# సహకరిస్తాం

- కీలక రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామిగా 'తెలంగాణ'
- ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ఏర్పాటుపై అధ్యయనం
- టాంజానియా బృందంతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఐటీ, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, మహిళా సాధికారత, ఎమర్జింగ్ టెక్నాలజీస్, డిజిటల్ గవర్నెన్స్, డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, కెపాసిటీ బిల్డింగ్, స్కిల్ డెవలెప్ మెంట్ తదితర కీలక రంగాల్లో టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్ ను సిద్ధం చేస్తామన్నారు. శనివారం డా.బీ ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టాంజానియా మినిస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్, ఐటీ, ఇన్నోవేషన్ ముద్రిక్ రమదాని సోరాగా నేతృత్వంలోని అత్యున్నత స్థాయి బృందం మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యింది. 'తెలంగాణ – టాంజానియా' మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సామాజిక, ఆర్థిక సమ్మిళిత వృద్ధికి బలమైన పునాదిగా మారిందన్నారు. ఆ దిశగా తెలంగాణ వేసిన అడుగులు ప్రపంచ పటంలో మన రాష్ట్రానికి ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ ను క్రియేట్ చేశాయన్నారు. ఇదే స్ఫూర్తితో డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మారేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారం, మెంటార్ షిప్, నైపుణ్య మార్పిడి అందిస్తామన్నారు. అక్కడ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు గల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. 'మీ సేవ' ద్వారా డోర్ స్టెప్ సిటిజన్ సర్వీసెస్ డెలివరీ, 'వీ హబ్' మార్గ నిర్దేశంలో మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సహం, స్టార్టప్ ఎకో సిస్టం బలోపేతం తదితర అంశాల్లో ఒక 'నాలెడ్జ్ పార్ట్నర్'గా వ్యవహరిస్తామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ పై మార్గనిర్దేశం చేస్తామన్నారు. బ్లూ ఎకానమీ, టూరిజంలో టాంజానియా అవలంభిస్తోన్న బెస్ట్ ప్రాక్టీసెస్ పై అధ్యయనం చేసి... తెలంగాణలోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 'డిజిటల్ ఎకానమీగా మారాలన్న మా లక్ష్య సాధనలో తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాల వ్యూహాత్మక భాగస్వామ్యం ఆవశ్యకం. ఐటీ, హెల్త్ కేర్, మెడికల్ టూరిజం, డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో సాధించిన ప్రగతి, చేపట్టిన సంస్కరణలు మాకు స్ఫూర్తిదాయకం. అందుకే... తెలంగాణతో కలిసి పని చేసేందుకు త్వరలోనే ఎంవోయూ కుదుర్చుకుంటాం' అని టాంజానియా మంత్రి ముద్రిక్ రమదాని సోరాగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో టాంజానియా కమ్యూనికేషన్, ఐటీ, ఇన్నోవేషన్ మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి ఫాత్మా మబ్రూక్ ఖమిస్, జాంజిబార్ ఐసీటీ అథారిటీ సీఈవో శుకూరు అవాద్ సులేమాన్, ప్రెసిడెంట్స్ డెలివరీ బ్యూరో – హెడ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్ మెంట్స్ జాన్ మహుండి తదితరులు పాల్గొన్నారు.

# అంజన్నకు మొక్కులు

- మండుటెండను సైతం లెక్క చేయకుండా కొండ గట్టుకు
- దిగ్విజయంగా ముగిసిన ఆశీర్వాద యాత్ర
- 40 కిలోమీటర్లు నడిచిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్





**ముద్ర, కరీంనగర్:**
అంజన్న ఆశీర్వాద యాత్ర పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ ప్రజాప్రతినిధులతో చేపట్టిన ఒకరోజు పాదయాత్ర దిగ్విజయంగా ముగిసింది. మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మేయర్ పీఠాన్ని అప్పగిస్తే తన పార్లమెంట్ పరిధిలో ఎన్నికైన బీజేపీ ప్రజాప్రతినిధులందరితో కలిసి కొండగట్టు అంజన్న సన్నిధికి కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించుకుంటానంటూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. 11 గంటల్లో దాదాపు 40 కిలోమీటర్ల మేర నడిచి కొండగట్టుకు చేరుకున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా మధ్యలో చిన్న అవాంతరాలు ఎదురైనా, తేనె టీగలు హంగామా సృష్టించినా అదరకుండా బెదరకుండా అన్నీ అధిగమిస్తూ అంజన్న ఆలయ సన్నిధికి చేరుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు, ఉప సర్పంచులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్, మేయర్ తో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటే, కరీంనగర్ నుంచి కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుంటానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చుకుంటున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆయన 'అంజన్న ఆశీర్వాద యాత్ర' పేరుతో భారీ పాదయాత్ర నిర్వహించారు.

**భారీగా తరలివచ్చిన కార్యకర్తలు:**
ఎండను సైతం లెక్కచేయకుండా దాదాపు 10 వేల మందికి పైగా బీజేపీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, హనుమాన్ భక్తులు ఆయనతో కలిసి నడిచారు. పది తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ యాత్రను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కీలక రాజకీయ వ్యాఖ్యలు చేశారు తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు లోపాయకారి ఒప్పందం చేసుకున్నాయని, ఎంఐఎంతో కూడా రహస్య మంతనాలు సాగిస్తున్నాయని ఆరోపించారు. ఈ మూడు పార్టీలు ఒక్కటైనా వచ్చే ఎన్నికల్లో గెలిచేది బీజేపీనేనని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కుటుంబాన్ని అరెస్టు చేసే ధైర్యం లేదని విమర్శించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా బీజేపీ సత్తా చాటుతుందని, త్వరలోనే రాష్ట్రంలో 'డబుల్ ఇంజన్' సర్కార్ రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

**పాదయాత్రలో అపశ్రుతి**
యాత్ర కొనసాగుతుండగా రామడుగు మండలం వెదిర వద్ద స్వల్ప అపశ్రుతి చోటుచేసుకుంది. పాదయాత్రను చిత్రీకరించే క్రమంలో డ్రోన్ కెమెరా అనుకోకుండా చెట్టుకు ఉన్న తేనెతుట్టెను తాకడంతో తేనెటీగలు దాడి చేశాయి. తేనెటీగల దాడిలో ముగ్గురు కార్పొరేటర్లు, మరో ముగ్గురు కాషాయ శ్రేణులు గాయపడ్డారు. వీరిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స ఇప్పించారు. ఆ తర్వాత యాత్రను తిరిగి ప్రారంభించారు.

**గంగాధరలో మధ్యాహ్న భోజనం**
రామడుగు మండలం కోన్ రావుపేట నుండి బయలుదేరిన పాదయాత్ర కురిక్యాల మీదుగా మధ్యాహ్నం 3.30 గంటలకు గంగాధర మండల కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ స్థానిక వీఏఎస్ ఫంక్షన్ హాలులో బీజేపీ శ్రేణులందరికీ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు తిరిగి పాదయాత్రను ప్రారంభించిన బండి సంజయ్ వెంకటాయపల్లి, పూడూరు మీదుగా కొండగట్టుకు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటలకు దొంగల మర్రి క్రాస్ రోడ్ వద్దకు చేరుకున్నారు. దొంగల మర్రి నుండి రాత్రి 7.30 గంటల వరకు కొండగట్టు అంజన్న ఆలయం వద్దకు చేరుకుని అంజన్న ఆశీర్వాద యాత్రను దిగ్విజయంగా ముగించనున్నారు. అనంతరం బీజేపీ ప్రజాప్రతినిధులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇచ్చిన మాట ప్రకారం ఆంజనేయస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.

**యాత్ర ప్రారంభమైందిలా..**
బండి సంజయ్ శుక్రవారం సాయంత్రం 7.30 గంటలకు ఢిల్లీ నుండి బయలుదేరి అర్ధ రాత్రి 1.30 గంటలకు కరీంనగర్ కు చేరుకున్నారు. మరుసటి ఉదయం 7 గంటలకే కరీంనగర్ మహాశక్తి ఆలయం వద్ద పూజలు నిర్వహించి యాత్రను ప్రారంభించారు. అక్కడికి చేరుకున్న నూతనంగా ఎన్నికైన బీజేపీ సర్పంచులు 108 మంది, 450 మంది వా ర్డు సభ్యులు, 54 మంది కార్పొరేటర్లు, కౌ న్సిలర్లతోపాటు వేలాది మంది కాషాయ శ్రేణులతో కలిసి కాలినడకన బయలుదేరారు. సన్నిహితులు ఎంత ఒత్తిడి చేసినా బూట్లు వేసుకునేందుకు ససేమిరా అన్నా రు. కేవలం సాక్సులతోనే నడక ప్రారంభించారు.





## ముగిసిన హెచ్. జె దొర అంత్యక్రియలు

- పాడే మోసిన డిజిపి, పోలీస్ కమిషనర్లు, పోలీస్ అధికారులు

**ముద్ర, హైదరాబాద్:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గా సుదీర్ఘ కాలం సేవలు అందించి, అలుపెరుగని సంస్కర్తగా పేరుగాంచిన మాజీ డిజిపి హెచ్. జె. దొర అంత్యక్రియలు శనివారం జూబ్లీ హిల్స్ లోని మహాప్రస్థానంలో పలువురి అశ్రునయనాల మధ్య ముగిశాయి. జూబ్లీ హిల్స్‌లోని ఆయన స్వగృహం నుండి శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన అంతిమయాత్రలో పోలీసు అధికారులు, సిబ్బంది, అభిమానులు పాల్గొనగా, మహాప్రస్థానం వద్ద అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు శనివారం మధ్యాహ్నం వరకు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించిన పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు ఘన నివాళులర్పించారు. తన మార్గదర్శికి అంతిమ గౌరవం సమర్పిస్తూ రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి స్వయంగా పాడే మోశారు. ఆయనతో పాటు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ కూడా పాడే మోసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఎస్పీగా ఉన్న తొలి నాళ్లలో తనను ప్రోత్సహించి, హెచ్. జె దొర సొంత జిల్లా అయిన శ్రీకాకుళానికి ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చి విధి నిర్వహణలో దిశానిర్దేశం చేసిన జ్ఞాపకాలను ఈ సందర్భంగా డిజిపి గుర్తుచేసుకున్నారు. మాజీ డిజిపి జితేందర్, ఐపిఎస్ అధికారులు రాజీవ్ త్రివేది, ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఐఎస్డబ్ల్యు, ఓఎస్డి కమలాసన్ రెడ్డి తదితరులు పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. పోలీస్ వ్యవస్థకు హెచ్.జె దొర చేసిన సేవలు స్మరించుకుంటూ వీడ్కోలు పలికారు.

# రాజకీయం చేయొద్దు

- విషజలాలకు 40 లక్షల మంది బాధితులు
- మానవత్వంతో ఆలోచించండి
- మూసి పునరుజ్జీవనం చేయాలి
- అభివృద్ధి, ప్రజా సంక్షేమమే మా ప్రధాన ఎజెండా
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
మూసీ విషజలాలతో బాధపడుతున్న 40 లక్షల మంది బాధితుల గోస చూడాలని, రాజకీయాల కోసం అడ్డుపడవద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్లగొండ ప్రజల ఆరోగ్యం గురించి మానవత్వంతో ఆలోచించాలని, 30ఏళ్లకే 60ఏళ్ల మనుషుల లాగా మారిపోతున్నారని, కిడ్నీ, క్యాన్సర్ లాంటి భయంకర వ్యాధులతో సతమతం అవుతున్నారన్నారు. నల్లగొండ అంటేనే ఫ్లోరైడ్ జిల్లా అని, విషపు జలాల జిల్లా అని పేరుందని, ఇక్కడి ప్రజల గోసను మానవత్వంతో అర్థం చేసుకోవాలని కోరుతున్నానన్నారు. హయత్ నగర్ సాయిబాబా టెంపుల్ (తొర్రూర్ క్రాస్ రోడ్) నుండి 10కోట్ల అంచనా వ్యయంతో 2లేన్ నుండి 4లేన్ రహదారిగా అభివృద్ధి చేస్తున్న పనులకు శనివారం మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసి పునరుజ్జీవనం చేయాలని ఆలోచించిన సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం భవిష్యత్ తరాలకు మేలు చేస్తుందని, దాదాపు మూడు గంటల ప్రజెంటేషన్ చూశామని, నల్లగొండ ప్రజల కష్టాలు ఎలా తొలగుతాయి అనేది కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. గంగా నదిని, యమునా నదిని శుభ్రం చేస్తున్నారని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు ఇది గమనించాలన్నారు. మురికి కూపంలా ఉన్న మూసిలో మంచి నీటిని పారేలా చేస్తామంటే అడ్డు కోవడం ఎందుకని, 10 వేల మంది ఇళ్లు కోల్పోతున్నారని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తప్పకుండా చేస్తామన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం చేస్తున్న మంచి పనిని ప్రతిపక్షాలు రాజకీయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన ఎజెండా అని, ఎవరెన్ని రాజకీయ విమర్శలు చేసినా ప్రజల ఆరోగ్యం కోసం కాంగ్రెస్ ను కోరుకుంటారని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ప్రజల ఆరోగ్యం తమకు ప్రధానమని, దానికి కట్టుబడి ఉన్నామన్నారు. ట్రాఫిక్ దృష్ట్యా, ప్రజా అవసరాల మేరకు పలు రోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టామని, ఈ ప్రాంతాన్ని డెవలప్ చేస్తామన్నారు. సుమారు 940 కోట్లతో నిర్మిస్తున్న ఈ డబుల్ డెక్కర్ కారిడార్ లో రాష్ట్ర ప్రభుత్వం వాటా 200 కోట్లు చెల్లించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయని, త్వరలో దీనికి సంబంధించిన మీటింగ్స్ ఉన్నాయని, ఈ డబుల్ డెక్కర్ కారిడార్ లో పైన మెట్రో రైలు, నేషనల్ హైవే,కింద స్థానికులు వాహనాలు క్రాస్ చేసేందుకు యాక్సిడెంట్స్ కు ఆస్కారం లేకుండా వెహికిల్ అండర్ పాస్ లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతం నుండే మూడు హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్లు రాబోతున్నాయని, ప్రత్యామ్నాయ సిటీగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, ఇక్కడ నుండే చెన్నై,బెంగళూరు, ముంబై పూణెను కలుపుతూ..హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్, హైవే కారిడార్లు రాబోతున్నాయన్నారు.

### పెళ్లికి నిరాకరించిందని

## ప్రతీకారం

- యువతికి హెచ్ఐవీ ఇంజెక్షన్ ఇచ్చిన యువకుడు

**ముద్ర న్యూస్ :**
హైదరాబాద్‌లోని పోచారంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. తనతో పెళ్లికి నిరాకరించిందని ఓ యువతికి ఎయిడ్స్ రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించాడు. ఇటీవల విడుదలైన ఓ సినిమా తరహాలో జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. పోచారం పరిధికి చెందిన మనోహర్ యువకుడు ఎయిడ్స్ బాధితుడు. మనోహర్‌తో అతని తల్లిదండ్రులకు కూడా ఎయిడ్స్ ఉంది. ఈ విషయాన్ని దాచి ఓ యువతితో వివాహానికి సిద్ధపడ్డాడు. అయితే ఎయిడ్స్ ఉందని తేలడంతో ఆ పెళ్లికి యువతి నిరాకరించింది. దీంతో సదరు యువతిపై మనోహర్ కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీన యువతి ఇంటికి మనోహర్ వెళ్లాడు. తనతో పెళ్లికి ఒప్పుకోవాలని ఒత్తిడి చేశాడు. కానీ అందుకు యువతి నిరాకరించింది. దీంతో ఆమెపై కక్షతో తన రక్తంతో కూడిన ఇంజెక్షన్‌ను ఆమెకు బలవంతంగా ఎక్కించాడు. ఈ ఘటనపై బాధితురాలు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మనోహర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# పరీక్షలు - ఏకాగ్రత



ఇటీవల నేను ఒక కళాశాలలో 'కెరీర్ గైడెన్స్' పై ఉపన్యాసం ఇవ్వడానికి వెళ్లాను. అక్కడ డిగ్రీ, పీజీ విద్యార్థులు పరీక్షల సమయంలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని ఎలా అధిగమించాలో చెప్పమని అడిగారు. మాట్లాడుతున్న సమయంలో ఒక ఫైనల్ ఇయర్ విద్యార్థి లేచి "సార్, నాకు పది సబ్జెక్టులు బ్యాక్‌లాగ్స్ ఉన్నాయి. భయంగా ఉంది. ఎలా అధిగమించాలి?" అని అడిగాడు. అప్పుడు నేను అతనికి ఒక చిన్న కథ చెప్పాను.

ఒక యువకుడు గురువు వద్దకు వెళ్లి "నేను ఏ పని మీద దృష్టి పెట్టలేకపోతున్నాను. పరీక్షలు దగ్గరపడితే భయం వేస్తోంది. దయచేసి నన్ను ఈ సమస్య నుంచి బయటపడేలా చేయండి" అని అడిగాడు. గురువు అతనికి ఒక గిన్నె నిండా నీరు తీసుకురమ్మన్నాడు. శిష్యుడు నీరు తీసుకొచ్చాడు. గురువు "ఈ నీటిలో నీ ముఖం చూసుకో" అన్నాడు. కానీ నీరు కదులుతుండటంతో అతనికి స్పష్టంగా కనిపించలేదు.

అప్పుడు గురువు ఇలా చెప్పాడు: "నీ మనస్సు కూడా ఈ నీటిలాగే కదులుతోంది. గిన్నెను నిశ్చలంగా పట్టుకుంటే నీరు ప్రశాంతంగా ఉంటుంది. అలాగే మనస్సును స్థిరంగా ఉంచి ఏకాగ్రత పెంచుకుంటే సమస్యలు చిన్నవిగా కనిపిస్తాయి. ముందుగా ఆలోచనలను స్థిరపరుచుకో, విజయం దగ్గరలోనే ఉంటుంది."

ఈ కథ ద్వారా అర్థమయ్యేది ఏమిటంటే, తరగతి గదిలో నేర్చుకున్న పాఠాలను ఇంటికి వెళ్లాక మళ్లీ పునశ్చరణ (Revision) చేస్తే అవి బాగా గుర్తుంటాయి. పాఠశాల స్థాయిలో విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతారు. కానీ కళాశాలకు వచ్చాక ఆ క్రమశిక్షణ కొంత తగ్గిపోతుంది. టీనేజ్ వయస్సులో ఆలోచనల్లో వచ్చే మార్పుల వల్ల చదువుపై దృష్టి తగ్గుతుంది. రోజులు గడుస్తాయి, పుస్తకాలు దూరమవుతాయి. పరీక్షల షెడ్యూల్ వచ్చేసరికి భయం మొదలవుతుంది. చదవాల్సిన సిలబస్ ఎక్కువ, సమయం తక్కువగా ఉంటుంది.

మొదటి ప్రయత్నంలోనే పరీక్షలు పాస్ అయితే ఎలాంటి సమస్య ఉండదు. కానీ చాలా మంది చివరి సంవత్సరానికి వచ్చేసరికి 10–15 సబ్జెక్టులు బ్యాక్‌లాగ్స్ గా మిగులుతాయి. అప్పుడు తల్లిదండ్రుల ఒత్తిడి, తోటి విద్యార్థుల ముందు చిన్నచూపు వంటి కారణాలతో ఒత్తిడి పెరుగుతుంది. ఈ పరిస్థితికి అసలు కారణం ఎవరో ఒక్కసారి మనమే మనల్ని ప్రశ్నించుకోవాలి.



చదువు ద్వారా వచ్చే గౌరవం, గుర్తింపు ఎంతో గొప్పది. ఒక వ్యాపారవేత్త కోట్లు సంపాదించినా అతను కోటీశ్వరుడిగానే గుర్తింపు పొందుతాడు. కానీ చదువుతో ఎదిగిన సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, మార్క్ జుకర్‌బర్గ్, స్టీవ్ జాబ్స్ లాంటి వారు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. అందుకే మీరు తరగతి గదికి ఎందుకు వచ్చారో, మీ లక్ష్యం ఏమిటో ముందుగా ఆలోచించాలి.

మీ భవిష్యత్తుపై స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. గురువులను కలసి బ్యాక్‌లాగ్స్ నుంచి బయటపడే మార్గం తెలుసుకోవాలి. వారి మార్గదర్శకత్వంలో చదువుపై మళ్లీ దృష్టి పెట్టాలి. ఫలితాలు వచ్చినప్పుడు నోటీసు బోర్డులో మీ పేరు కనిపిస్తే కలిగే ఆనందం మాటల్లో చెప్పలేనిది.

అయితే చదువు మీద ఆసక్తి లేకపోతే నిజాయితీగా తల్లిదండ్రులకు చెప్పాలి. మీకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకుని వారి సహకారంతో ముందుకు వెళ్లాలి. కానీ చదువు బలహీనంగా ఉందని నిరుత్సాహపడకండి. దాన్ని అధిగమించడానికి ప్రధాన ఆయుధం ఆత్మవిశ్వాసం. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చు.

ప్రస్తుతం యువతలో పెద్ద సమస్య టైమ్ మేనేజ్‌మెంట్ లోపం. సమయాన్ని సరిగ్గా వినియోగించక విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారు. మీతో చదువులో మెరుగైన వారిని ఆదర్శంగా తీసుకుని వారితో కలిసి చదివితే మీ అకాడమిక్ స్థాయి కూడా మెరుగవుతుంది.

చివరిగా చెప్పేదేమిటంటే .. పరీక్షలు ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్, సెమిస్టర్ లేదా వార్షికమైనా ఫలితాలు మీ ప్రణాళికపైనే ఆధారపడి ఉంటాయి. పరీక్షల సమయంలో కాలక్షేపం చేస్తూ చివరికి అవమానాన్ని ఎదుర్కోవద్దు.

"ప్రపంచంలో అత్యంత విలువైనది కాలం. దాన్ని కొనలేం, అమ్మలేం. దాన్ని ఎలా ఉపయోగించుకోవాలో మీ మైండ్‌సెట్ మీదే ఆధారపడి ఉంటుంది."

కాబట్టి లేవండి... పరీక్షలు దగ్గరపడుతున్నాయి. పుస్తకాలు తెరవండి. ఏకాగ్రతతో చదవండి. ఫలితం తప్పకుండా మీకు అనుకూలంగా ఉంటుంది.

**డాక్టర్ మహమ్మద్ హసన్**
అసిస్టెంట్ ప్రొఫెసర్
మీ ఆలోచనలే మిమ్మల్ని నిర్దేశిస్తాయి
వ్యక్తిత్వ వికాసం మరియు కెరీర్ గైడెన్స్ పుస్తక రచయిత
సెల్ :9908059234



## నిజాలు నిష్ఠూరాలు



నిజాన్ని దాచేస్తున్నారు —
వెలుగు భయంతో,
అబద్ధాల ముసుగులతో
అద్దాలన్నీ కప్పేస్తున్నారు.

నిజాన్ని బందిస్తున్నారు —
పదాల జైలులో పెట్టి,
నిజ స్వరాన్ని
గోడల మధ్య నొక్కేస్తున్నారు.

నిజాన్ని చూడొద్దంటున్నారు —
కళ్ళకు గంతలు కట్టి,
మాయామాటలతో
మార్గాలు మళ్లిస్తున్నారు.

నిజాన్ని చెప్పొద్దంటున్నారు —
సత్యస్వరాన్ని మూయించి,
న్యాయ దీపాన్ని
నిశ్శబ్దంలో ముంచేస్తున్నారు.

నిజాన్ని కొనేస్తున్నారు —
ధనపు తూకాలలో తూచి,
ధర్మాన్నికూడా
దుకాణపు సరుకుగా చేస్తున్నారు.

నిజాన్ని నొక్కేస్తున్నారు —
అబద్ధాల భారంతో
సత్యపు గుండెపై
రాళ్లు పెడుతున్నారు.

నిజం కొట్టుకుంటుంది —
నొక్కిన గుండెలోనూ
ధర్మం ధడకధడక మోగి
వెలుగై బయటపడుతుంది.

కాని —
నిజం దేవత, దాచినా దివ్య కాంతి దాగదు.
నిజం సూర్యుడు —
మబ్బులు కమ్మినా మరలా ఉదయించక మానదు.

చివరికి —
అబద్ధాల రాజ్యాలు కూలిపోతాయి,
మాయల మేడలు కరిగిపోతాయి;
కాల సింహాసనంపై కూర్చునేది —
నిజం దేవతే.

- **గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం.**



# ఔషధ రంగాన్ని శాసించిన ధీశాలి అంజిరెడ్డి

**మార్చి 15: డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కళ్ళం అంజిరెడ్డి వర్ధంతి**

భారత ఔషధ రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ కళ్ళం అంజిరెడ్డి. ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించి, తన పరిశోధన, దూరదృష్టితో ప్రపంచ ఫార్మా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ స్థాపకుడిగా ఆయన భారతదేశానికి గర్వకారణంగా నిలిచారు.

1941 జనవరిలో గుంటూరు జిల్లా తాడేపల్లిలో జన్మించిన అంజిరెడ్డి ప్రాథమిక విద్యను అక్కడే పూర్తి చేశారు. తరువాత గుంటూరులోని ఏసీ కాలేజీలో చదివి, బాంబే విశ్వవిద్యాలయంలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో పీజీ పూర్తి చేశారు. పుణెలోని నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీలో పీహెచ్‌డీ చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని ఐడీపీఎల్‌లో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు.



పలు కంపెనీల్లో పనిచేసిన అనుభవంతో 1984లో కేవలం రూ.25 లక్షల పెట్టుబడితో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌ను స్థాపించారు. రివర్స్ ఇంజనీరింగ్ ద్వారా ఖరీదైన మందులకు జనెరిక్ రూపాలను తయారు చేసి తక్కువ ధరలో అందుబాటులోకి తెచ్చారు. ఐబూప్రూఫెన్ వంటి మందులను అమెరికా మార్కెట్‌కు సరఫరా చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. తర్వాత నార్ఫ్లాక్సాసిన్, సిప్రోఫ్లాక్సాసిన్ వంటి అనేక ఔషధాలతో కంపెనీ వేగంగా ఎదిగింది.

పరిశోధనకు ప్రాధాన్యత ఇచ్చిన ఆయన డాక్టర్ రెడ్డీస్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించి వందలాది శాస్త్రవేత్తలతో కొత్త ఔషధాల అభివృద్ధికి కృషి చేశారు. అమెరికా, యూరప్, రష్యా, మధ్యప్రాచ్యం వంటి అంతర్జాతీయ మార్కెట్లలో కంపెనీ విస్తరించింది. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన తొలి ఆసియా ఫార్మా కంపెనీల్లో డాక్టర్ రెడ్డీస్ ఒకటి.

సామాజిక సేవలోనూ అంజిరెడ్డి ముందున్నారు. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాలకు తాగునీరు అందించేందుకు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. 2013 మార్చి 15న అంజిరెడ్డి కన్నుమూశారు. ఔషధ రంగంలో ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి.

- **సుధాకర్.ఏ.వి**
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)



## కలత నిద్ర

"అమ్మా యుద్ధం అంటే ఏంటి?" అని అడిగాడు పిల్లోడు
దగ్గరగా హత్తుకొని,నుదిటి పై ముద్దు పెట్టి
ముఖం నిమురుతూ
నువ్వు గీసావే తెల్ల పావురం అని చెప్పే లోపే
గోడ కూలిన శబ్దం
మాట పూర్తవ్వకుండానే ముగిసిపోతుంది జీవితం
కలత నిద్రలో మరణించిన వాడిలా
తెల్లారాక ప్రపంచం అంతా చూస్తుంది
నిర్జీవంగా పడి ఉన్న
పిల్లాడి చేతిలో
పావురం గుండా రక్తం పారుతూ రంగు మారిన చిత్రం
మెలకువను ఏ పీడ కలో
లాక్కెళ్లినట్టూ
మరో మూలన
తెగిపడ్డ తల్లి చేయి చూపుడు వేలు నీ వైపే చూస్తూ!
నువ్వు...నువ్వూ ...!
సాక్షివా?
రేపటి బాధితుడివా?

- **పి. సుష్మ**
9959705519
మక్తల్

## వినియోగదారుడే రాజు...


# హక్కులపై అవగాహన అవసరం

**– మార్చి 15 ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం**

వస్తువులు, సేవల నాణ్యత, ధర, ప్రమాణం, స్వచ్ఛత వంటి అంశాలపై పూర్తి సమాచారం తెలుసుకునే హక్కు వినియోగదారుల హక్కుగా భావిస్తారు. 1962 మార్చి 15న అమెరికా కాంగ్రెస్‌లో వినియోగదారుల హక్కుల బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెనడీ నాలుగు ప్రాథమిక వినియోగదారుల హక్కులను ప్రకటించారు. అనంతరం 1972లో అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల ప్రతినిధి అన్వర్ ఫజల్ మార్చి 15ను ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా పాటించాలని ప్రతిపాదించడంతో 1973 నుంచి అనేక దేశాలు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి.

భారతదేశంలో వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు 1986లో వినియోగదారుల పరిరక్షణ చట్టం రూపొందించారు. ఈ చట్టం ప్రకారం వినియోగదారులకు ఆరు ముఖ్య హక్కులు కల్పించారు. వాటిలో ప్రమాదకరమైన వస్తువుల నుంచి రక్షణ పొందే హక్కు, సరైన సమాచారం తెలుసుకునే హక్కు, నాణ్యమైన వస్తువులు–సేవలు ఎంపిక చేసుకునే హక్కు, తమ సమస్యలను వినిపించే హక్కు, సేవా లోపాలపై పరిహారం పొందే హక్కు, వినియోగదారుల విద్య హక్కులు ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కొరత వల్ల వినియోగదారులు తరచూ మోసాలకు గురవుతున్నారు. అందుకే 1989లో భారత ప్రభుత్వం మార్చి 15ను




వినియోగదారుల దినోత్సవంగా ప్రకటించింది.

ప్రస్తుతం ఈ–కామర్స్, టెలిషాపింగ్, ఆన్‌లైన్ కొనుగోళ్లు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాలు కూడా పెరిగాయి. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని 1986 చట్టానికి బదులుగా 2019 వినియోగదారుల పరిరక్షణ చట్టం తీసుకువచ్చి 2020 జూలై 20 నుంచి అమలు చేస్తున్నారు.

ఈ చట్టం ప్రకారం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్లు ఏర్పాటయ్యాయి. తక్కువ ఖర్చుతో, త్వరితగతిన వినియోగదారులకు న్యాయం అందించడం వీటి లక్ష్యం. అదనంగా సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (CCPA) ఏర్పాటు చేసి మోసపూరిత ప్రకటనలు, వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకునే అధికారాలు ఇచ్చారు. అవసరమైతే అరెస్టులు, జరిమానాలు విధించే అధికారం కూడా ఉంది.

వినియోగదారుల హక్కులపై ప్రజల్లో అవగాహన పెంచడం అత్యంత అవసరం. అందుకోసం పాఠశాలలు, కళాశాలల్లో వినియోగదారుల విద్యను పాఠ్యాంశాల్లో చేర్చి చట్టం ప్రాధాన్యంపై విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

- **రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 15.03.2026
www.mudranews.in | @mudranews



**ఎక్కువగా తినకండి**



ఒకేసారి అధికంగా ఆహారం తీసుకుంటే జీర్ణక్రియ మందగిస్తుంది. చిన్న పరిమాణాల్లో తరచూ తినడం గ్యాస్ సమస్య తగ్గిస్తుంది.

# ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

**జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 60 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా, 10,651 మంది విద్యార్థులకు గాను 10,630 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, దీంతో తొలి రోజు పరీక్షకు 98.80 శాతం హాజరు నమోదైందని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ తెలిపారు. ఇదివరకు పరీక్షల్లో తప్పిన ప్రైవేట్ విద్యార్థులు ఐదుగురిలో నలుగురు పరీక్ష రాయగా, ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో తొలి రోజు పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిసినట్లు డీఈఓ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మొత్తం 34 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. పాలెం, నాగర్ కర్నూల్ ప్రాంతాల్లోని రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పరీక్ష నిర్వహణను డీఈవో స్వయంగా పరిశీలించారు.







**పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సంబందించి జఫ్స్ బాయ్స్ వికారాబాద్ స్కూల్ లో పరీక్ష నిర్వహణ తీరును జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధింపు, బయటి వ్యక్తుల ప్రవేశంపై నిషేధం, సిసి టివి కెమెరాల ద్వారా పర్యవేక్షణ వంటి కఠిన చర్యలను పాటించాలని తెలిపారు. విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, డెస్కులు, సరైన వెలుతురు ఉండేలా చూడాలని వేసవి తీవ్రత కారణంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు, అదనపు కలెక్టర్ తో పాటు జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకా దేవి తదితరులు ఉన్నారు.

# ప్రేమ, సోదర భావానికి ప్రతీక రంజాన్

**ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి**

**ముద్ర, వనపర్తి:**



పవిత్ర రంజాన్ మాసం పరస్పర ప్రేమ, సోదర భావానికి ప్రతీకగా నిలుస్తుందని, ముస్లింలందరూ రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్ లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో పాటు హాజరై ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్‌లో పాల్గొని, పలువురికి రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఐక్యత పెంపొందించే పండుగగా రంజాన్ ప్రత్యేక స్థానం కలిగి ఉందన్నారు. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందేలా కృషి కొనసాగుతోందని తెలిపారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్పర్సన్ మాధవి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ముస్లిం మత పెద్దలు అఫ్జలుద్దీన్, రహీం, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేసే మిల్లర్లపై చర్యలు

**ముద్ర, వనపర్తి:**



రైతులు కష్టపడి పండించిన ధాన్యం ప్రభుత్వం రైసు మిల్లులకు అప్పగించిన తరువాత దానిపై ఏ విధమైన అక్రమాలు, నిర్లక్ష్యం లేదా దుర్వినియోగం జరిగిన తీవ్రంగా పరిగణిస్తామని ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లా పరిధిలోని కస్టమ్ మిల్లింగ్ రైస్‌కు సంబంధించిన పెండింగ్ కేసులపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను వేగవంతంగా విచారించి త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. . ఈ సమీక్ష సమావేశంలో వనపర్తి డీఎస్పీ, వెంకటేశ్వరరావు, డీసీఆర్బీ డీఎస్పీ, బాలాజీ, వనపర్తి సీఐ రత్నం, కొత్తకోట సీఐ రాంబాబు, జిల్లాలోని ఎస్సైలు పాల్గొన్నారు.

# ఘనంగా జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం

**ముద్ర, కూకట్‌పల్లి:**



జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని కెపిహెచ్‌బి కాలనీ 5వ ఫేస్‌లోని రాష్ట్ర జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జనసేన పార్టీ జనరల్ సెక్రెటరీ తాళ్లూరి రాము, ప్రచార కమిటీ కార్యదర్శి ఆర్కే సాగర్, రాష్ట్ర నాయకులు రాధారం రాజలింగం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నాయకులు, వీర మహిళల సమక్షంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్ తో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాప్రా సర్కిల్‌లో మెగా ఈ–వేస్ట్ కలెక్షన్

**ముద్ర, కాప్రా:**



ప్రజా పాలన పట్టణ ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు కాప్రా సర్కిల్ పరిధిలో మెగా ఈ–వేస్ట్ కలెక్షన్ కార్యక్రమం నిర్వహించారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఆధ్వర్యంలో సైనిక్ పురి వార్డు కార్యాలయం, కాప్రా, ఏఎస్ రావు నగర్, కుషాయిగూడ ,ఈసీ నగర్ కమ్యూనిటీ హాల్‌లలో మొత్తం ఐదు కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మొత్తం 1633 కిలోల ఈ–వేస్ట్ సేకరణ జరిగింది. కలెక్షన్ సెంటర్లలో మాత్రమే కాకుండా వీధుల్లో కూడా ప్రచారం నిర్వహించి, మైక్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగుతుందని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీహరి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ సాలిడ్ మేనేజ్మెంట్ రవి, సానిటేషన్ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్లు సుధీర్, రామకృష్ణ, శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏలు వసంత లక్ష్మి , సంజీవ్, ఇన్‌చార్జ్ ఎస్ఎఫ్ఏ అంజలి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నారాయణపేటను అభివృద్ధి చేస్తాం



**ముద్ర, నారాయణపేట:**

నారాయణపేట పట్టణాన్ని పార్టీలకతీతంగా కౌన్సిలర్లతో కలిసి సమష్టిగా అభివృద్ధి చేస్తామని పేట మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్య యాదవ్ అన్నారు. పట్టణంలోని 21, 22 వార్డులలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఆయా వార్డుల కౌన్సిలర్లు కమలాపూర్ ప్రభాకర్, రాజు ఘాట్ ఆధ్వర్యంలో శనివారం కొనసాగింది. కార్యక్రమంలో భాగంగా 21 వ వార్డు పరిధిలోని గోపాల్ పేట, దూల్పేట్, బురుడు వాడిలో నెలకొన్న ప్రధాన సమస్యలను కౌన్సిలర్ కమలాపూర్ ప్రభాకర్ చైర్పర్సన్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వార్డులో మహిళ టాయిలెట్లకు సంబంధించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. శానిటేషన్ కు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి ఎప్పటికప్పుడు పరిశుభ్రత ఉండేలా చూడాలన్నారు. మంచినీటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. వైస్ చైర్మన్ మంజుల రాఘవేందర్ రెడ్డి, కమిషనర్ గోల్కొండ నరసయ్య, ఇంజనీర్ మహేష్ తో పాటు జవాన్ నరేష్ పాల్గొన్నారు.

## "రాజ్యాంగానికి కాంగ్రెస్ తూట్లు పొడిచింది''

**ముద్ర, తాండూరు:**

రాజ్యాంగానికి కాంగ్రెస్ తూట్లు పొడుస్తుందని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్ అన్నారు. శనివారం తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి నివాసంలో పార్టీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. దేశంలో రాజ్యాంగాన్ని కాపాడలంటూ రాహుల్ గాంధీ చేత పట్టుకుని తిరుగుతుంటే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్‌లు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించి, కాంగ్రెస్‌లోకి వెళ్లినా వారిపై క్లీన్ చీట్ ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దమ్ముంటే 10 ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించి, మళ్లీ ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలపై హైకోర్టులో పిటిషన్ వేస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పట్లోళ్ల నర్సింలు, శ్రీనివాస్ చారి, కౌన్సిలర్లు అనిల్, యోగానంద్, ఈర్షాద్, నాయకులు సంతోష్ గౌడ్, ఎజాజ్, ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

# బస్తీ దవాఖానాలు విరివిగా ఏర్పాటు చేయాలి

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ముద్ర, కాప్రా:**



పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానాలు విరివిగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.డా. ఏఎస్ రావు నగర్‌లో ఉన్న బస్తీ దవాఖాన భవనం విస్తరణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై భవనం విస్తరణకు శంకుస్థాపన చేశారు.ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో బస్తీ దవాఖాన భవనాన్ని విస్తరించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ విస్తరణ పనులు పూర్తయిన తరువాత మరింత మంది ప్రజలకు సౌకర్యవంతమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు , బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎస్ సోమశేఖర్ రెడ్డి , సిపిఐ నాయకులు బోస్ డా. సత్యవతి కె ఈశ్వరయ్య డా. ఆర్ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు పరీక్షలతోనే క్యాన్సర్‌కు చెక్

**టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్చార్జ్ బండి రమేష్**

**ముద్ర, కూకట్‌పల్లి:**



ముందస్తు పరీక్షల ద్వారానే క్యాన్సర్‌మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రాణాలు కాపాడుకోవచ్చు అని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్చార్జ్ బండి రమేష్ అన్నారు. నందమూరి బాలకృష్ణ సారథ్యంలోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీ వసంత నగర్‌లో ఏర్పాటు చేసిన మూడు రోజుల ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మందికి క్యాన్సర్ చికిత్స అందిస్తున్న బాలకృష్ణ సేవలను కొనియాడారు. మొబైల్ యూనిట్ల ద్వారా ఇంటి వద్దకే వైద్యం అందించడం అభినందనీయమన్నారు. బసవతారకం వైద్య బృందం మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించి, ఫలితాల ఆధారంగా వెంటనే అవసరమైన సలహాలు, సూచనలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయి బాబు చౌదరి, కొప్పిశెట్టి దినేష్కు మార్, గాదే శివాచౌదరి, భానుప్రకాశ్‌పాల్గొన్నారు

**ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం**

ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేశ్‌పేర్కొన్నారు. స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు శనివారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దర్ నగర్‌లో స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ "ముందుగా డ్రెయినేజీ పనులను పూర్తి చేసి, ఆ తర్వాత పక్కాగా రహదారుల నిర్మాణం చేపడతామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. తమ సమస్యలపై స్పందించిన రమేశ్ కు స్థానిక ప్రజలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భారీ సఫ్దర్ నగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన





**ముద్ర, కూకట్‌పల్లి:**

నూతనంగా నిర్మించిన శ్రీ పద్మావతీ అలువేలు మంగా సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంతవైభవంగా జరిగింది. సీనియర్ నాయకులు శ్రీ జోగిపేట్ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ అరుణ్ గురుస్వామి చేతుల మీదుగా ధ్వజస్తంభ, శిఖర, రాజగోపురం, నరసింహస్వామి యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈవేడుకకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, శ్యామల దేవి హాజరవ్వగా వారితో పాటు మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ లోక కల్యాణం కోసం నిర్వహించినఈ ప్రతిష్ఠా మహోత్సవం కన్నుల పండుగగా జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. స్వామివారి ఆశీస్సులు రంతరం ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ఆలయ కమిటీ సభ్యులు ఈ వేడుకను విజయవంతం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి, స్మారక చిహ్నంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి మార్గం ద్వారానే మానసిక ప్రశాంతత లభిస్తుందని, శంషిగూడలో ఇలాంటి గొప్ప ఆలయం నిర్మించడం అభినందనీయమని కొనియాడారు.



**వైభవంగా కుంభాభిషేకం.. పాల్గొన్న ఎమ్మెల్యే**

కేపీహెచ్‌బీ 4వ ఫేజ్ లోని శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం కుంభాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే హోమం, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనాలు పలికారు. ఎమ్మెల్యేతో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ పరిసరాలన్నీ భక్తుల కోలాహలం, ఆధ్యాత్మిక నినాదాలతో మారుమోగాయి. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# ఘనంగా ఆర్ఎస్ఎస్ శత జయంతి వేడుకలు

**భారీ సంఖ్యలో హాజరైన హిందూ బంధువులు**

**ముద్ర, తాండూర్:**



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా హిందూ సమ్మేళనం వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని అయ్యప్ప నగర్ లో నిర్వహించారు. హిందూ సమ్మేళన ఉత్సవ సమితి అధ్యక్షుడు శ్రీ భాస్కర్ హక్కే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణా జిల్లా కేసరవెల్లిలోని భువనేశ్వరి పీఠాధిపతి ప్రముఖ హిందూ ధార్మిక ప్రవచనకర్త పూజ్యశ్రీ కమలానంద భారతి స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సమాజంలో కుల మత ప్రాంతీయ భేదాలు లేకుండా, బీద ధనిక తారతమ్యం లేకుండా హిందువులను సంఘటితంగా ఉంచడంలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. హిందూవులంతా ఐక్యంగా ఉండి భారతీయ సంస్కృతిని హిందూ సంప్రదాయాలను కాపాడాలని పిలుపునిచ్చారు.

# మహిళల భద్రత అందరి బాధ్యత

**ముద్ర, కూకట్‌పల్లి:**

మహిళల భద్రత కేవలం పోలీసులది కాదని, సమాజంలో ప్రతి ఒక్కరిదని కూకట్‌పల్లి జోన్ డీసీపీ రీతూ రాజ్ అన్నారు. మహిళల భద్రతపై ప్రజల్లో చైతన్యం కోసం కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద శనివారం ఉదయం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీమతి నిషా ఆధ్వర్యంలో సైబరాబాద్ పోలీసుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి జోన్ డీసీపీ రీతూ రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతదేశపు మొట్టమొదటి పారా సైక్లిస్ట్ కుమారి తాన్యా దగా ప్రత్యేక వక్తగా పాల్గొని అందరిలో స్ఫూర్తిని నింపారు. డీసీపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఈ ర్యాలీలో మహిళా సైక్లిస్టులు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'సురక్షిత ప్రయాణం –– సురక్షిత సమాజం' అనే సందేశాన్ని చాటారు. అనంతరం 'కాఫీ మీట్'లో పాల్గొన్న వారు పోలీసులతో ముఖాముఖి చర్చించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 15.03.2026
www.mudranews.in | @mudranews



**గ్యాస్ పెంచే ఆహారాలు తగ్గించండి**



బీన్స్, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటి కొన్ని ఆహారాలు గ్యాస్‌ను పెంచు తాయి. వీటిని మితంగా తీసుకోవడం మంచిది.

# దిగ్విజయంగా అంజన్న ఆశీర్వాద యాత్ర





**ముద్ర, కరీంనగర్:** ''అంజన్న ఆశీర్వాద యాత్ర'' పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ ప్రజాప్రతిని ధులతో చేపట్టిన ఒకరోజు పాదయాత్ర దిగ్విజయంగా ముగిసింది. మున్సిపల్ ఎన్ని కల్లో కరీంనగర్ మేయర్ పీఠాన్ని అప్పగిస్తే తన పార్లమెంట్ పరిధిలో ఎన్నికైన బీజేపీ ప్రజాప్రతినిధులందరితో కలిసి కొండగట్టు అంజన్న సన్నిధికి కాలినడకన వచ్చి మొక్కు లు చెల్లించుకుంటానంటూ ఇచ్చిన మాట ను నిలబెట్టుకున్నారు. 11 గంటల్లో ఏకబి గిన దాదాపు 40 కిలోమీటర్ల మేర నడిచి కొండగట్టుకు చేరుకున్నారు దాదాపు 40 డిగ్రీల మండుటెండను సైతం లెక్క చేయ





కుండా...మధ్యలో చిన్న అవాంతరాలు ఎదు రైనా, తేనెటీగలు హంగామా సృష్టించినా అధిగమిస్తూ అంజన్న ఆలయ సన్నిధికి చేరుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరి ధిలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు, ఉప సర్పంచ్ లు, సర్పంచ్ లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్, మేయర్ తో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**మహాదేవపూర్, ముద్ర:**



షెడ్యూల్ కులాల సహకార అభివృద్ధి సంస్థ ఆక్షన్ ప్లాన్ లో బ్యాంకు అనుసంధానంతో ఎలక్ట్రికల్ వాహనాలు, సోలార్ పంపుల కోసం దరఖాస్తుల ఆహ్వా నిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటి పరిధిలోని షెడ్యూల్డ్ కులాల వారు ఈవి టూ, త్రి వీలర్లు, సోలార్ పంపుల కోసం దర ఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయేతర పథకములకు వయస్సు 21 నుంచి 50 సంల వరకు వ్యవసాయ ఆధా రిత పథకములకు వయస్సు 21 నుండి 60 సం.లు కలిగిన వారు ఆన్లైన్ ద్వారా tsobmms.cgg.gov.in ఈనెల 17 నుండి 24 వరకు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థుల సంవత్సర ఆదాయం రూ. 1,50,000 గ్రామీణ ప్రాంతాల వారికి, రూ.2,00,000/- పట్టణ ప్రాంతాలైన మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ వారికి మించకుండా ఆదాయం కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా ఆధార్ కార్డ్రే షన్ కార్డు / ఫుడ్ సెక్యూరిటీ కార్డు, కుల ధృవీకరణ పత్రం,ఆదాయ ధృవీకరణ పత్రం శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, ఈవి ద్విచక్ర వాహనాల కోసం ఎస్.సి వ్యవస్థాపకులు / గిగ్ కార్మికులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

జొమాటో స్విగ్గీ రాపిడో, ఉబర్ సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రకటనలో తెలిపారు.

# జిల్లా వ్యాప్తంగా గ్యాస్ ఏజెన్సీల్లో తనిఖీలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేర కు శనివారం వివిధ మండలాల్లో అధికా రులు గ్యాస్ ఏజెన్సీల్లో తనిఖీలు నిర్వహిం చారు. తహసీల్దార్లు, పోలీసు సిబ్బంది, రెవె న్యూ అధికారులు సంయుక్తంగా ఏజె న్సీలను పరిశీలించారు. ఆయా మండ లాల్లో గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల్లో స్టాక్, అమ్మకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. అన్ని రకాల రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహిం చాలని పేర్కొన్నారు. గోదాముల్లోని సిలిం డర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతూ సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టించవద్దని ఆదేశించారు. ప్రజల అవస రాల మేరకు సిలిండర్లను అందించాలని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ లో




అమ్మినా, పక్కదారి పట్టించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు ఉంటా యని హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్ల కొనుగోలు నిమిత్తం వచ్చిన ప్రజలతో పలు వురు అధికారులు మాట్లాడారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, తగినంత స్టాక్ అందుబాటులో ఉందని చెప్పారు. ప్రజల అవసరాల మేరకు సిలిండర్లను అందిస్తామని తెలిపారు. ప్రజలు భయాం దో ళనలకు గురి కావొద్దన్నారు.

# ఎల్‌పీజీ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ పై నిఘా

**మహదేవపూర్, ముద్ర:** జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాలో అక్ర మాలను అరికట్టేందుకు నిఘా తీవ్రం చేసినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకట నలో తెలిపారు. గ్యాస్ సరఫరా అందు బాటును నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమి టీ ఏర్పాటు చేశామన్నారు. ఆయిల్ మార్కె టింగ్ కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీలు, జిల్లా అధికారులు సమన్వయం చేస్తూ విని యోగదారులకు అంతరాయం లేకుండా గ్యాస్ సరఫరా కొనసాగించే చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. గృహ వినియోగ వినియోగదారులతో పాటు ప్రభుత్వ సంక్షే మ హాస్టళ్లుకు గ్యాస్ సిలిండర్లు ప్రాధాన్య తతో సరఫరా చేయబడుతున్నట్లు తెలి పారు. గ్యాస్ గోదాములు, పంపిణీ కేంద్రా లను నిరంతరం తనిఖీ చేసేందుకు డీటీ, ఆర్ఐ, ఎస్ఐలు పర్యవేక్షణ చేయాలని ఆదే శించారు. తనిఖీలు నిర్వహిస్తూ అక్ర మాలను గుర్తించి చట్టపరమైన చర్యలు కోవాలని తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం సివిల్ సప్లైస్ అధికారులు నిర్వ హించిన తనిఖీల్లో ఆరు కేసులు నమోదు చేసి, 13 గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిం డర్లను స్వాధీనం చేసుకున్నట్లు వె ల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలి పారు. జిల్లా యంత్రాంగ సమాచారం మాత్రమే ప్రజలు పరిగణనలోకి తీసుకో వాలన్నారు. జిల్లాలో గ్యాస్ నిల్వలు, సర ఫరా పరిస్థితిపై ప్రతిరోజు నివేదికను రాష్ట్ర స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీకి పంపుతున్నామన్నారు. ఈ కమిటీలో ఎస్పీ, రెవెన్యూ అదనపు కలెక్టర్, ఆయిల్ మార్కె టింగ్ కంపెనీల ప్రాంతీయ మేనేజర్లు, ఆర్ టీఓ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, డీపీ ఓ, డీఈఓ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖల జిల్లా సంక్షేమ అధికారులు, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘ ప్రతినిధి సభ్యు లుగా ఉంటారని చెప్పారు. డీఎస్ ఓ కన్వీ నర్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లాలో పదో తరగతి పరీక్షలు శని వారం ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 16 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 47 కేంద్రాల్లో 9,750 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో 4,786 మంది బాలురు కాగా, 4,964 మంది బాలికలు. పరీక్షలను సజా వుగా నిర్వహించేందుకు 47 మంది చొప్పు న చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్ మెం టల్ అధికారులను నియమించారు. అలాగే 535 మంది ఉపాధ్యాయులు ఇన్విజి లేటర్లుగా పని చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పోలీసులు నిషే ధాజ్ఞలు విధించారు. పరీక్ష ముగిసే వరకు జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచేలా ఆదే శాలు జారీ చేశారు. కాగా పరీక్షా కేంద్రాలు ఎక్కడున్నాయో తెలుసుకునేందుకు ఈ



సారి హాల్ టికెట్లలో స్కానర్ ద్వారా లొకే షన్ చూసుకునే సౌకర్యం కల్పించారు. తొలిరోజు తెలుగు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా ఆరుగురు హాజరు కాలేదు. కలెక్టర్ అభి లాష అభినవ్ బాలికల ఉన్నత పాఠశాలను, ఎస్పీ జానకి షర్మిల మేధ ఉన్నత పాఠ శాలను సందర్శించి పరీక్షల సరళిని పరిశీ లించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్లు, డిఈఓ పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లాలోని లక్ష్మణ చాంద మండల కేంద్రంలో రూ. 1.83 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.40 లక్షలతో నిర్మించే నాలుగు స్వంవ సహాయక బృందాల భవన నిర్మాణానికి, రూ. 40 లక్షలతో వర్కింగ్ షెడ్ ల నిర్మాణానికి, రూ.60 లక్షలతో 5 అంగన్ వాడీ భవనాల నిర్మాణానికి, రూ. 10 లక్షలతో కేజీబీవీ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.30 లక్షలు వ్యయమయ్యే ధాన్యం నిలువ గోదాం, రూ. 3లక్షల మాదిగ సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్ ను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు అన్ని విధాల సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, పార్టీ మండల అధ్యక్షుడు చిన్నయ్య, సర్పంచ్ ఓస కవిత రాజు, మాజీ ఎంపీపీ అడ్వాల రమేష్ , మాజీ సర్పంచ్ ముత్యం రెడ్డి, ఉపసర్పంచ్ వర్ష రవి, నాయకులు రంజిత్, సురేష్, రవి, పోశెట్టితో పాటు మండల బీజేపీ నాయకులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్




**మహదేవపూర్, ముద్ర:** మండలంలోని జంగేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరు, పరీక్షా కేంద్రంలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షా హాళ్లను సందర్శించి, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అవసరమైన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్, పరిశుభ్రత, భద్రత వంటి మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షలు పారదర్శకంగా, అవకతవకలు లేకుండా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు ఒత్తిడికిలోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.ఈ తనిఖీలో విద్యాశాఖ అధికారి రాజేందర్, పరీక్షా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు




**మహదేవపూర్, ముద్ర:** విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షాలు రాయాలని స్థానిక సీఐ శ్వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని స్థానిక సీఐ శ్వెంకటేశ్వర్లు, ఎస్సై సాయి శశాంక్ లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## రెవెన్యూ ఉద్యోగులకు క్రీడా పోటీలు




**ముద్ర, మంచిర్యాల:** ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాలలో రెవెన్యూ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మాన సిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నిత్యం విధుల్లో ఒత్తిడితో పనిచేసే ఉద్యోగులకు క్రీడలు ఉపశమనం కలిగిస్తాయన్నారు. ఉద్యోగులతో కలిసి కలెక్టర్ సరదాగా క్రికెట్ ఆడి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రయ్య, శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలయత్ అలీ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 15-03-2026
www.mudranews.in | @mudranews



రోజూ వ్యాయామం చేయండి
నడక లేదా తేలికపాటి వ్యాయామం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. దీంతో కడుపులో గ్యాస్ తగ్గుతుంది.



# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## - చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అందరు సమన్వయంతో పనిచేయాలని భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం పురపాలక సంఘం పరిధి లోని వార్డు నెం.22, 28, 34లలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేశారు. వార్డులో పేరుకుపోయిన చెత్త, చెట్లను తొలగించి, మురికి కాలువలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు జాలిగం విగ్నేశ్, సుధాగాని సరిత రాజు, తుమ్మేటి పాండు పాల్త్య వెంకటేష్,




బొంతల నర్సింగ్ రావు, బింగి నరేష్ బర్రె పూజిత జహంగీర్, బెండె స్వరూప లాల్ రాజు, సరగడ రాజ్యలక్ష్మి అమర్, మున్సిపల్ అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధాల పేరుతో ప్రజలపై భారం మోపవద్దు

## - భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం దేశ ప్రయోజనాలకు విరుద్ధం..
## - సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

యుద్దాల పేరుతో ప్రజలపై భారం మోపే విధానాలు అపి, అందరికి వంట గ్యాస్ అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకువాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరిలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం పెరబోయిన మహేందర్ అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. భారత్–అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న వైఖరి దేశ ప్రయోజనాలకు విరుద్ధమని అయన తీవ్రంగా విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే ఎంపీటీసీ, జెడ్పిటీసీ ఎన్నికల్లో అధిక స్థానాల్లో పోటీ చేసి విజయాలు సాధించే దిశగా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడ చంద్రయ్య, రాష్ట్ర సమితి




సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్, కల్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, ఏశాల అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కల్లేపల్లి మహేందర్, గాదెగాని మాణిక్యం, దుబ్బాక భాస్కర్, అన్నేమైన వెంకటేష్, ఉట్కూరి నర్సింహా, రేకల శ్రీనివాస్, సిలివేరు దుర్గయ్య, లక్ష్మయ్య, గోరేటి రాములు, ఎలగందుల అంజయ్య, చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, ఆలేటి బాలరాజు, జెల్డి రాములు, ఎల్లంకి మహేష్, ఉప్పాల శాంతి కుమార్, ఇంజ హేమలత, అరే పుష్ప, వడ్లకొండ భారతమ్మ పాల్గొన్నారు.

# తండ్రి మరణంలోనూ ఎస్సెస్సీ పరీక్షలకు..



ముద్ర, మోత్కూరు/ఖమ్మం:

వేర్వేరు ప్రాంతాలలో తండ్రులు మృతి చెందగా వారి కుమారులు బాధను దిగమింగుతూ పది పరీక్షలకు హాజరయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన ఉపాధ్యాయుడు కూరెళ్ళ ఎల్లయ్య శుక్రవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందాడు. ఆయన కుమారుడు హర్షవర్ధన్ దుఃఖాన్ని దిగమింగుకుని శనివారం ప్రారంభమైన 10వ తరగతి పరీక్షకు హాజరయ్యాడు. గుండాల మండలం వస్తకొండూరులో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఎల్లయ్యకు నిన్న ఉదయం ఛాతీలో నొప్పి రాగా నల్గొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో



హైదరాబాద్ తీసుకెళ్లమని వైద్యులు సూచించగా హైదరాబాద్ తరలిస్తుండగా ఎల్లయ్య మృతి చెందాడు.

### ఖమ్మం జిల్లా బత్తులపల్లిలో..

ఖమ్మం జిల్లా కల్లూరు మండలం బత్తులపల్లిఉన్నత పాఠశాలలో చదువుతున్న గండేపల్లి మణికంఠ తండ్రి కొండలరావు శుక్రవారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందాడు. పితృ వియోగాన్ని దిగమింగుకొని విద్యార్థి పరీక్షకు హాజరయ్యాడు. కొండలరావు గ్రామంలోనే వ్యవసాయ పనులకు వెళుతూ భార్య పిల్లలను పోషించేవాడు. కామెర్ల వ్యాధి రావడంతో మంచానికే పరిమిమై వైద్యం చేయించుకునే స్తోమత లేక వ్యాధి ముదరడంతో ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందతూ మృతి చెందాడు.

## తోపుగని చెరువు వద్ద

# ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్ట పట్టణం తోపుగని చెరువు గోదావరి జలాలతో నిండి అలుగు పోస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో ఉన్న ప్రతి చెరువు నిండేలా చేసి ప్రజలకు, రైతులకు నీరు అందించడం తమ లక్ష్యమని తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలోని తోపుగాని చెరువు నిండడంతో పరిసర ప్రాంతాల చెరువులు కూడా నింపేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. యాదగిరిగుట్ట నుండి వంగపల్లి, రామాజీపేట, తాళ్లగూడెం తదితరంగా 15కు పైగా గ్రామాలకు చెరువులు నింపి నీరు అందే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. చెరువులు నిండడంతో రైతులకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని ఎమ్మె ల్యే పేర్కొన్నారు.

## స్వర్ణగిరిలో జల నారాయణ స్వామికి మంగళహారతులు



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అర్చక స్వాములు స్వామి వారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనం తరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్య మానంగా వెలుగుతున్న సహస్ర దీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. దివ్య క్షేత్రంలో శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు.



## ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలను

# పరిశీలించిన అదనపు కలెక్టర్

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు పరిశీలించారు. శనివారం భువనగిరి పట్టణంలోని గంజ్ హైస్కూల్, భువనగిరి లోని ప్రభుత్వ బాలుర పాఠశాల, విజ్ఞాన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పరీక్షకు విద్యార్థులు ఎంతమంది హాజరయ్యారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు భయాందోళన చెందకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, భద్రతా చర్యలు, మెడికల్ సిబ్బంది తదితర అంశాలను పరిశీలించారు. పరీక్షలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా



పరీక్షలు సజావుగా నిర్వహించి పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.



## తాజ్ పూర్ లో రంజాన్ తోఫా పంపిణీ

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

భువనగిరి మండలంలోని తాజ్ పూర్ గ్రామంలో యువ నాయకుడు ఇల్యాస్ మహమ్మద్ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ తోఫా అందజేశారు. ఈ కార్యక్ర మంలో ర్యాకాల శ్రీనివాస్, ,సీనియర్ మైనారిటీ నాయకులు షరీఫ్, గ్రామ ఉప సర్పంచ్ వార్డ్ సభ్యులు, మజీద్ కమిటీ ప్రెసిడెంట్ అహ్మద్, కాంగ్రెస్ నాయ కులు జుబైర్, మహేందర్ పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా పంపిణీ చేసిన కౌన్సిలర్



ముద్ర ప్రతినిధి, భువనగిరి:

భువనగిరి పట్టణంలోని 20వ వార్డు కౌన్సిలర్ హేమలత జగన్మోహన్ సొంత నిధులతో రంజాన్ పండుగ పురస్కరించుకొని, దివంగత నేత కాంగ్రెస్ పార్టీ నాయకులు హస్మతుల్లా షా జ్ఞాపకార్థం శనివారం ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ముల్తానిషా, ఆవుల వినోద్, నరాల ఎట్టయ్య, టెంపుల్ చైర్మన్ చాగంటి సురేష్, ధర్మకర్త పల్లెపాటి రామాంజనేయులు, సోమ రవీందర్ రెడ్డి, దోప్ప హరికృష్ణ, కర్తల జగన్, మహమ్మద్ అక్బర్, యాట ప్రసాద్ , ఉబేద్, సద్దాం, భీష్మ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిపై సర్పంచ్ దాడి

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

భువనగిరి మండలం జమ్మాపురం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మాదాను మోహిజ్‌పై గ్రామ సర్పంచ్ ఉర్ధయ్య దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో మాదాను మోహిజ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆయనను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రజలను కాపాడాల్సిన సర్పంచ్ ఉర్ధయ్య వీధి రౌడీలా ప్రవర్తిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాధితులు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



# కోదాడలో కల్తీ వంట నూనెల కలకలం

ముద్ర ప్రతినిధి, కోదాడ:

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో కల్తీ వంట నూనెల వ్యవహారం కలకలం రేపుతోంది. పట్టణంలోని ఒక ఆయిల్ షాపులో కల్తీ నూనె విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు ప్రాంతం నుండి ట్యాంకర్ల ద్వారా కోదాడతో పాటు సూర్యాపేట, హైదరాబాద్‌కు కూడా కల్తీ నూనె తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నూనెను స్థానికంగా ఖాళీ క్యాన్‌లలో నింపి సీల్ వేసి ప్రముఖ బ్రాండ్ల పేర్లతో మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇంకా ఈ కల్తీ నూనెను పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లకు సరఫరా చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అర్ధరాత్రి సమయంలో హైవే పక్కన ట్యాంకర్ నుండి ఆటోలో ఉన్న



ఖాళీ క్యాన్‌లలో నూనె నింపుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

గుట్టుచప్పుడు కాకుండా గత కొన్నేళ్లుగా ఈ కల్తీ నూనెల వ్యాపారం కొనసాగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి లూజ్ ఆయిల్ వాడకూడదని ప్రభుత్వ నిబంధన ఉన్నప్పటికీ కల్తీ ఆయిల్ ను ఇలా ఖాళీ క్యాన్‌లలో నింపి సీల్ వేసి పలు హోటళ్లు, రెస్టారెంట్లకు తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నాసిరకం నూనె వాడటం వల్ల ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఆహార భద్రతా అధికారులు, సంబంధిత శాఖలు దృష్టి సారించి పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# న్యాయవాది రహీం నివాసంలో ఇఫ్తార్ విందు

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

న్యాయవాది ఎంఎ రహీం నివాసంలో శనివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, గ్రంథాల చైర్మన్ మహమ్మద్ అవేజ్ చిస్తి, మాజీ జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, టిఎన్జీవో మందడి ఉపేందర్ రెడ్డి, నాయకులు తంగళ్ళపల్లి రవికుమార్,



వివిధ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
15.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





నీటిని ఎక్కువగా తాగండి
తగినంత నీరు తాగడం వల్ల ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. ఇది గ్యాస్ సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది.

# ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



జిల్లాలో గ్యాస్ సిలిండర్ల వినియోగదారులకు నిరంతరంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడానికి జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచనల మేరకు కలెక్టర్ అధ్యక్షతన ఈ కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కమిటీలో ఎస్పీ, అదనపు కలెక్టర్, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రాంతీయ మేనేజర్లు, ఆర్‌టీఓ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, జిల్లా విద్యాశాఖాధికారి, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘ ప్రతినిధి సభ్యులుగా ఉంటారని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కన్వీనర్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల సరఫరా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, డిస్ట్రిబ్యూటర్ల గోదాముల్లో నిల్వల స్థితిని రోజువారీగా పరిశీలించడం, నిల్వ కేంద్రాలు మరియు పంపిణీ కేంద్రాల వద్ద భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయడం వంటి అంశాలను కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. అలాగే సిలిండర్ల నిల్వచేయడం, దారి మళ్లింపు, బ్లాక్ మార్కెటింగ్, గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగించడం వంటి చర్యలను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. అవసరమైతే ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

# అంగన్‌వాడీల అభివృద్ధితో పిల్లలకు మేలు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**



అంగన్‌వాడీల అభివృద్ధితో చిన్న పిల్లలకు మేలు జరుగుతుందని లేడీస్ సర్కిల్ నేషనల్ ప్రెసిడెంట్ శీసం సబర్వాల్, శివాని టిబ్రివాల్, సికింద్రాబాద్ లేడీస్ సర్కిల్ 17 చైర్‌పర్సన్ భావన సుమన్ అన్నారు. లేడీస్ సర్కిల్ ఇండియా, రోటరీ లేక్ మొయినాబాద్ సంస్థల సహకారంతో సిద్ధిపేట అర్బన్ మండలంలోని బక్రీచెప్యాల, తడ్కపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను రూ. 4 లక్షల వ్యయంతో పునరుద్ధరణ పనులు చేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు గ్రామాల్లో అంగన్‌వాడీలను రీనోవేట్ చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర వాతావరణంలో ఆడుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. తాగునీటి ట్యాంకు, కిటికీలు, పెయింటింగ్, తలుపులు వంటి సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెంటర్లను పరిశుభ్రంగా ఉంచడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ వాటిని అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బక్రీచెప్యాల గ్రామ సర్పంచ్ శ్రీలత, పంచాయతీ సెక్రటరీ శ్రీవాణి, అంగన్‌వాడీ సెంటర్ టీచర్ పద్మ, ప్రతినిధులు భావన సుమన్, గ్రామ నాయకులు శ్రీనివాస్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు-బైక్ ఢీ.. ముగ్గురు మృతి

- మృతుల్లో తండ్రి, కొడుకు, అల్లుడు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆర్టీసీ బస్సుబైక్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందిన విషాద సంఘటన శనివారం సాయంత్రం మెదక్ జిల్లా కొల్చారం మండలం రాంపూర్ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హవేలి ఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన అమృత్ గౌడ్ (50), అతని కుమారుడు రిషి వర్ధన్ గౌడ్ (12), కూతురిని ఇచ్చిన బి. భూపతిపూర్ గ్రామానికి చెందిన అల్లుడు సాయా గౌడ్ (35) కుల్చారం మండలం రంగంపేట గ్రామంలో జరిగిన తమ బంధువు ఇంట్లో తొట్టెల కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో మెదక్‌హైదరాబాద్ 765డి జాతీయ రహదారిపై రాంపూర్ శివారులో మెదక్ వైపు నుంచి నర్సాపూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. బంధువుల ఫిర్యాదు మేరకు కొల్చారం ఎస్ఐ మొహమ్మద్ మోహినుద్దీన్ కేసు నమోదు చేసి మృతదేహాలను మెదక్ జిల్లా ఆస్పత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. బూరుగుపల్లి, బి. భూపతిపూర్ గ్రామాల్లో విషాదం అలుముకుంది.

### ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

రాంపూర్ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మెదక్‌నర్సాపూర్‌సికింద్రాబాద్ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ జర్జీ, ఎస్ఐ సత్యనారాయణ, మొహినుద్దీన్, ఆర్టీసీ డీఎం సురేఖ తదితరులు ఉన్నారు.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంచండి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నర్మేట గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, చిక్కుడుకాయ కూర, టమాట పప్పు, రసం, పెరుగు వంటి వంటకాలను పరిశీలించారు. టమాట పప్పు నాణ్యతను మెరుగుపరచాలని, కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వండిన ప్రతి వంటకం రుచికరంగా ఉండి విద్యార్థులు కడుపునిండా తినేలా ఆహారం సిద్ధం చేయాలని ఎస్ఓకు ఆదేశించారు. రోజువారీ విద్యార్థుల హాజరు ప్రకారం వంట సరుకులు అందించాలని తెలిపారు. భోజనం, వసతి, చదువు విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, విద్యార్థులకు లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఎస్ఓను ఆదేశించారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు



మెదక్ జిల్లా కేంద్రంలో పదవ తరగతి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు రెగ్యులర్ విద్యార్థులు 99.83 శాతం, ప్రైవేట్ విద్యార్థులు 64.29 శాతం హాజరైనట్లు డీఈఓ విజయ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 11,239 మంది ఉన్నారు. వీరిలో 11,220 మంది హాజరుకాగా 19 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్‌గా నమోదైన 14 మంది విద్యార్థుల్లో 9 మంది హాజరుకాగా 5 మంది గైర్హాజరయ్యారు.

**నర్సాపూర్‌లో అదనపు కలెక్టర్ తనిఖీ..**

నర్సాపూర్‌లోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నగేష్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ సక్రమంగా జరుగుతున్న తీరు, కేంద్రంలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షా హాళ్లను సందర్శించి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అవసరమైన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్, పరిశుభ్రత, భద్రత వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మెదక్, హవేలి ఘనపూర్‌లో ఆర్డీఓ పర్యవేక్షణ..**

మెదక్ పట్టణం, హవేలి ఘనపూర్ ప్రాంతాల్లోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఆర్డీఓ రమాదేవి సందర్శించారు. జిల్లా కేంద్రంలోని న్యూ హై స్కూల్, సెయింట్ డాన్ బాస్కో పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలు, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మణ్ బాబు తదితరులు పాల్గొన్నారు. హవేలి ఘనపూర్ మండల కేంద్రంలోని హైస్కూల్, మహాత్మా జ్యోతిబా ఉన్నత పాఠశాలను కూడా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హవేలి ఘనపూర్ తహసీల్దార్ సింధు రేణుక తదితరులు పాల్గొన్నారు.

**భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన అదనపు ఎస్పీ..**

అదనపు ఎస్పీ మహేందర్ మెదక్ పట్టణంలోని సిద్ధార్థ హై స్కూల్, గర్ల్స్ హై స్కూల్, సర్ధన పాఠశాలలను తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరిగేలా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలిరోజు పరీక్షలు జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ముగిశాయని పేర్కొన్నారు.



# పెట్టుబడిదారీ వ్యవస్థను ఎదిరించడానికి మార్క్సిజమే మార్గం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



పెట్టుబడిదారీ వ్యవస్థను ఎదిరించడానికి మార్క్సిజమే పరిష్కారమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. శనివారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన మార్క్స్ వర్ధంతి సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో కొనసాగుతున్న ఆర్థిక, సామాజిక దోపిడిని ఎదిరించే మార్గం కారల్ మార్క్స్ సిద్ధాంతాల్లోనే ఉన్నదని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో జరుగుతున్న ఆర్థిక, సామాజిక దోపిడీ నుంచి విముక్తి పొందేందుకు మార్క్స్ సిద్ధాంతాలు మార్గదర్శకంగా నిలిచాయని తెలిపారు. మార్క్స్ సిద్ధాంతాల ఆధారంగా లెనిన్ ఆచరణాత్మక సిద్ధాంతంతో 1917లో ఏర్పడిన రష్యన్ సోషలిస్టు వ్యవస్థ కార్మిక వర్గానికి కనీస సౌకర్యాలు కల్పించిందని చెప్పారు. ప్రస్తుతం అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతో అనేక దేశాలపై యుద్ధాలు చేస్తుండగా, వాటి నివారణకు ప్రపంచం కమ్యూనిస్టు దేశం చైనా, ఒకప్పటి కమ్యూనిస్టు దేశం రష్యా వైపు చూస్తోందన్నారు. 2005లో అమెరికాలో ఆర్థి క సంక్షోభం వచ్చినప్పుడు పరిష్కారం కోసం మార్క్స్ రచించిన 'పెట్టుబడి' గ్రంథాన్ని ప్రపంచ ఆర్థికవేత్తలు పరిశీలించారని తెలి పారు. మార్క్స్ ఆశయాల కొనసాగింపుకు సీపీఎం పార్టీ కృషి చేస్తోందన్నారు. మార్చి నెలంతా ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి పోరాటాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కె. నరసమ్మ మాట్లాడుతూ 17న మున్సిపల్ కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని కోరారు. 24న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాలని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. ఆడివయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలమణి, ఏ. మల్లేశం, కే. మల్లేశం, బస్వరాజు, జిల్లా కమిటీ సభ్యులు డి. మల్లేశం, సంతోష్, అజయ్, పూర్ణ, కార్యకర్తలు యశోద, శౌకత్, కవిత, బాబు, నరేందర్, వెంకట్, ప్రవీణ్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

### సిద్దిపేటలో..

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట** : మార్క్సిజమే మానవాళికి సరైన మార్గం చూపిస్తుందని దోపిడీ అసమానతలను ప్రారదోలేది ఒకే ఒక ఆయుధం మార్క్సిజం మాత్రమేనని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ అన్నారు. కారల్ మార్క్స్ 143వ వర్ధంతి కార్యక్రమం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాళ్ల బండి శశిధర్ మాట్లాడుతూ.. ప్రపంచ మానవాళికి దోపిడి నుండి విముక్తి చెందాలంటే అందుకు సరైన మార్గం చూపిన వ్యక్తి కారల్ మార్క్స్ అని, ఆయన సిద్ధాంతం ప్రకారం అసమానతలు లేని, దోపిడీ లేని సమాజం నిర్మించడమే మార్క్సిజం యొక్క అంతిమ లక్ష్యమని వారన్నారు. 1848లోనే కమ్యూనిస్టు ప్రణాళికలు రూపొందించి దోపిడికి పీడనకు గురి అవుతున్న కార్మిక వర్గానికి మొట్ట మొదటిసారిగా దిక్సూచిని అందించినటువంటి మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్ అన్నారు. .ఈ కార్యక్రమంలో సీపీఎం సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, అమ్ముల బాల నర్సయ్య, జాలిగాపు శిరీష నాయకులు మామిడాల కనకయ్య, తునికి మహేష్, వంగ రవీందర్ రెడ్డి, కొండం సంజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల జీతాలు చెల్లించాలి

- జీవో 51 సవరణతో మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్ప రవికుమార్ డిమాండ్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన మెమోను రద్దు చేసి, ప్రభుత్వమే గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల ఖాతాల్లో జీతాలు జమ చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్ప రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు క్యాంపు కార్యాలయంలో ఆఫీస్ ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను పంచాయతీ నిధుల ద్వారా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం మార్చి 2వ తేదీన జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. సిబ్బందిని రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. అలాగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా జీవో నెం. 51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్లో నమోదు కాని కార్మికుల పేర్లను తక్షణమే నమోదు చేయాలని కోరారు. కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని, నూతనంగా ఎన్నికైన సర్పంచుల వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల తొలగింపులపై చర్యలు తీసుకోవాలన్నారు. కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానం వల్ల గ్రామాల్లో అనేక పనులు చేయిస్తున్నారని, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమ్ముల బాల్ నర్సయ్య, జిల్లా కార్యదర్శి తునికి మహేష్, కోశాధికారి చిట్యాల కనకయ్య, జిల్లా నాయకులు రాజనర్సయ్య, పిల్లి రవీందర్, యాదగిరి, మల్లయ్య, కనకయ్య, లక్ష్మి, కనకవ్వ, బాల్ నర్సవ్వ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# 17న పీఐబీ 'వార్తాలాప్' మీడియా వర్క్‌షాప్

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

సంగారెడ్డి జిల్లాలోని విలేకరుల కోసం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) హైదరాబాద్ విభాగం ఈనెల 17న 'వార్తాలాప్' మీడియా వర్క్‌షాప్‌ను నిర్వహించనుంది. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పీ. ప్రవీణ్య ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ వర్క్‌షాప్‌లో మహిళలపై లింగ ఆధారిత హింస, స్త్రీ సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జర్నలిజంలో కృత్రిమ మేధ వినియోగంపై అవగాహన కల్పించనున్నారు. ఈ అంశాలపై ప్రముఖ పాత్రికేయురాలు సజయ కాకర్ల, ఫ్యాక్ట్ చెక్ శిక్షణ నిపుణురాలు సత్యప్రియ బీఎన్ జర్నలిస్టులకు దిశానిర్దేశం చేయనున్నారు. విలేకరులతో సమన్వయాన్ని బలోపేతం చేయడం, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించడం, పత్రికా రంగంలో వస్తున్న నూతన మార్పులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై జర్నలిస్టులకు అవగాహన కల్పించడమే ఈ వర్క్‌షాప్ లక్ష్యమని పీఐబీ తెలిపింది. సంగారెడ్డి జిల్లాకు చెందిన జర్నలిస్టులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఐబీ కోరింది.

# ఇఫ్తార్ విందు

- పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ



**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

ఆందోల్ నియోజకవర్గ కేంద్రంలోని జోగిపేట శ్రీరామ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, డీఆర్వో పాండు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సురేందర్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు డాకూరి వెంకటేశం, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్లు తోట్ల రామకృష్ణ, అరుణ్ కుమార్, కౌశిక్ రాజశేఖర్, నియోజకవర్గ మైనారిటీ నాయకులు, జిల్లా వైద్యాధికారి డా. వసంత్ కుమార్, డీఎస్పీ సత్తయ్య గౌడ్, ఆందోల్ తహసీల్దార్ మధుకర్ రెడ్డి, జోగిపేట సీఐ అనిల్ కుమార్, మాజీ కౌన్సిలర్లు రంగా సురేష్, శరత్ బాబు, పట్లోళ్ల ప్రవీణ్, చిట్యాల మధు, కోరబోయిన నాగరాజు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 15.03.2026
www.mudranews.in | @mudranews




పొగ తాగడం మానండి

స్మోకింగ్ వల్ల కూడా కడుపులో గాలి చేరి గ్యాస్ సమస్య పెరుగు తుంది. కాబట్టి ఈ అలవాటు మానడం మంచిది.



# ఎఫైర్లు పెరుగుతున్నాయి..



**-టాప్ లో కాంచీపురం**
**-వివాహేతర సంబంధాల్లో దేశంలో హైదరాబాద్ కు 11వ స్థానం**
**-పెరిగిన వివాహేతర సంబంధాలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
ఒకప్పుడు కేవలం మెట్రో నగరాలకే పరిమితమైన వివాహేతర సంబంధాల ధోరణి ఇప్పుడు చిన్న పట్టణాలకు కూడా పాకిందా? ప్రముఖ డేటింగ్ ప్లాట్‌ఫామ్'ఆష్లే మాడిసన్ విడుదల చేసిన తాజా నివేదిక ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఆలయాలకు నిలయమైన కాంచీపురం నుండి ఐటీ హబ్ హైదరాబాద్ వరకు.. వివాహేతర సంబంధాలు ఎక్కడ ఎక్కువగా ఉన్నాయి? అనే విషయాలు బయటకు వచ్చాయి.

### సంబంధాల్లో మార్పులు..

భారతదేశంలో మారుతున్న జీవనశైలికి తగ్గట్టుగానే సంబంధాల విషయంలో కూడా సంచలన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా ప్రముఖ డేటింగ్ ప్లాట్‌ఫామ్ ఆష్లే మాడిసన్ విడుదల చేసిన నివేదిక భారతీయుల వ్యక్తిగత సంబంధాలపై విస్తుపోయే నిజాలను వెలుగులోకి తెచ్చింది. కేవలం మెట్రో నగ రాలకే పరిమితమైన వివాహేతర సంబం ధాలు, ఇప్పుడు ద్వితీయ శ్రేణి నగరాల్లో కూడా వేగంగా విస్తరిస్తున్నాయని ఈ సర్వే స్పష్టం చేసింది.

### టెంపుల్ సిటీ కాంచీపురం నంబర్ వన్

ఆలయాలకు, పట్టు చీరలకు ప్రసిద్ధి చెందిన తమిళనాడులోని కాంచీపురం ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత ఏడాది 17వ స్థానంలో ఉన్న ఈ నగరం.. కేవలం ఒక్క సంవత్సరంలోనే మొదటి స్థానానికి చేరుకుంది. చిన్న పట్టణాల్లో కూడా డేటింగ్ యాప్‌ల వినియోగం ఏ స్థాయిలో పెరుగుతుందో చెప్పడానికి ఇదొక నిదర్శనం.

### ఢిల్లీ-ఎన్సీఆర్ జోరు.. ముంబై మిస్సింగ్

దేశ రాజధాని ప్రాంతం ఈ ప్లాట్‌ఫామ్ వినియోగంలో భారీ రికార్డులను నమోదు చేసింది. సెంట్రల్ ఢిల్లీ రెండవ స్థానంలో ఉండగా, టాప్ 20 జాబితాలో ఢిల్లీకి చెందిన 9 ప్రాంతాలు చోటు సంపాదించుకున్నాయి. గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్ వంటి నగరాలు కూడా ముందంజలో ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే దేశ ఆర్థిక రాజధాని ముంబై ఈసారి టాప్ 20 నగరాల జాబితాలో లేకపోవడం గమనార్హం.

### ఇతర నగరాల పరిస్థితి ఏంటి?

కాంచీపురం, ఢిల్లీ తర్వాత వరుసగా గురుగ్రామ్, గౌతమ్ బుద్ధ నగర్, డెహ్రాడూన్, పూణే, బెంగళూరు, చండీగఢ్, లక్నో, కోల్‌కతా, హైదరాబాద్ వంటి నగరాలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఇందులో హైదరాబాద్ 11వ స్థానంలో ఉంది. వివాహేతర సంబంధాలను అంగీకరించే వ్యక్తుల రేటు భారత్, బ్రెజిల్‌లో అత్యధికంగా ఉందని తేల్చింది.

దాదాపు 53 శాతం మంది భారతీయులు తమ జీవి తంలో ఏదో ఒక సమయంలో ఇటువంటి సంబంధాల్లో పాల్గొన్నారని సర్వే పేర్కొంది.

### ఎందుకు పెరుగుతున్నాయి..?

ఈ పెరుగుదల వెనుక సామాజిక, మానసిక కారణాలు ఉన్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**పని ఒత్తిడి:** సుదీర్ఘ పని గంటల వల్ల భాగస్వాముల మధ్య సమయం తగ్గడం.

**భావోద్వేగ దూరం:** సంబంధాల్లో పెరిగిన కమ్యూనికేషన్ గ్యాప్.

**ఆన్‌లైన్ ప్రైవసీ:** డేటింగ్ యాప్‌లు అందించే గోప్యత వల్ల వ్యక్తులు ఇతరులతో రహస్యంగా కనెక్ట్ అవ్వడం సులభమైంది.

**వ్యక్తిగత స్వేచ్ఛ:** ఆధునిక జీవనశైలిలో వ్యక్తిగత స్వేచ్ఛకు ఇస్తున్న ప్రాధాన్యత కూడా ఒక ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

మొత్తానికి.. ఒకప్పుడు మెట్రో నగరాలకే పరిమితమైన ఈ ధోరణి ఇప్పుడు చిన్న నగరాలకు కూడా పాకిపోవడం సమాజంలో మారుతున్న విలువలకు అద్దం పడుతోంది.

## కాంగ్రెస్ కు షాక్..
# గులాబీ వైపు జీవన్ రెడ్డి అడుగులు?

**-హస్తంలో జీవన్ రెడ్డి వివాదం**
**-పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధం**
**-త్వరలో బీఆర్ఎస్ లో చేరే ఆలోచన**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
కాంగ్రెస్ సీనియర్ నేత తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ మారే అవకాశం కనిపిస్తోంది. జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాల్లో జీవన్ రెడ్డికి, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు మధ్య ఎప్పటి నుంచో పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వైరం ఉంది. గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ బీఆర్ఎస్ నుంచి గెలవగా, జీవన్ రెడ్డి ఓటమి పాలయ్యారు. అయితే, అనూహ్యంగా సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకు ప్రభుత్వం , పార్టీలో ప్రాధాన్యత పెరగడం జీవన్ రెడ్డికి మింగుడుపడటం లేదు. తనను సంప్రదించకుండానే బద్ధ శత్రువును పార్టీలోకి తీసుకోవడం తనను అవమానించడమేనని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. పార్టీపై ఆయన చాలా కాలంగా అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

### కేసీఆర్‌తో భేటీకి రంగం సిద్ధం..

ఇటీవల ఆయన తాను పార్ట మారే ఆలోచనలో ఉన్నానని చెబుతున్నారు. ఈ క్రమంలో జీవన్ రెడ్డి ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నెల 20వ తేదీ తర్వాత ఆయన హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసి, గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉంది. ఇప్పటికే జగిత్యాలలోని తన అనుచరులతో, కీలక నేతలతో ఆయన వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ మార్పుపై క్షేత్ర స్థాయిలో అభిప్రాయ సేకరణ పూర్తి చేశారని, మెజారిటీ అనుచరులు ఆయన నిర్ణయానికి మద్దతు తెలిపారని సమాచారం.

### కాంగ్రెస్ బుజ్జగింపులు విఫలం

జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీ వీడకుండా ఉండేందుకు కాంగ్రెస్ అధిష్టానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి బుజ్జగించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ, సంజయ్ కుమార్ విషయంలో తనకు జరిగిన అన్యాయాన్ని ఆయన గట్టిగా ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడితే, ప్రత్యర్థిని తెచ్చి నెత్తిన కూర్చోబెట్టడం ఏమిటి అని ఆయన తన సన్నిహితుల వద్ద వాపోయినట్లు సమాచారం. ఈ పరిణామా కారాణం ఆయన వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదని చెబుతున్నారు. ఒకవేళ జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరితే, జగిత్యాల నియోజకవర్గంలో సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. కాంగ్రెస్ కేడర్‌లో చీలక రావడం ఖాయం. అటు బీఆర్ఎస్‌కు ఈ సీనియర్ నేత రాక పెద్ద బలాన్ని ఇస్తుందని ఆ పార్టీ భావిస్తోంది. పార్టీ మారే అంశంపై జీవన్ రెడ్డి నుంచి త్వరలోనే ఒక అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

కాంగ్రెస్ పార్టీతో తాటిపర్తి జీవన్ రెడ్డికి దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా విడదీయలేని అనుబంధం ఉంది. 1980వ దశకంలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, జగిత్యాల నియోజకవర్గం నుండి ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి ఆ ప్రాంతంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోడ్లు, భవనాల శాఖ వంటి కీలక మంత్రి పదవులను నిర్వహించిన జీవన్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అత్యంత సన్నిహితుడిగా ఉండేవారు. ఓటమి ఎదురైనప్పుడు కూడా పార్టీని వీడకుండా విధేయుడిగా ఉన్న ఆయన తెలంగాణ ఉద్యమం తర్వాత వెనుకబడిపోయారు. వరుసగా ఓడిపోతూ వస్తున్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసినా ఓడిపోయారు.

## విద్యార్థుల రక్షణకు
# చర్యలు చేపట్టండి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
బాసర ఐఐఐ టీలో విద్యార్థుల రక్షణ, సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. శనివారం ఆయన బాసర ఐఐఐటీని సందర్శించారు. వర్సిటీలో జరుగుతున్న అడ్మిషన్ల ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో విద్యార్థుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి, వైస్ చాన్స్ లర్ గోవర్ధన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీపై అభిశంసన నోటీసు..

**– విపక్షాల కోపానికి కారణాలు ఇవే!**



**ముద్ర డెస్క్:**
భారత ఎన్నికల ప్రధాన అధికారిపై విపక్ష పాటీలు ఒక్కటిగా అభిశంసన నోటీసులు ఇచ్చాయి. 193 మంది ఎంపీల సంతకాలతో ప్రతిపక్షాలు ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. 130 మంది లోక్‌సభ సభ్యులు 63 మంది రాజ్యసభ సభ్యులు తీర్మానంపై సంతకాలు చేశారు. ఎన్నికల పారదర్శకతపై అనుమానాలు, బీజేపీ సపోర్ట్ ఆరోపణలతో నోటీసులు ఇచ్చాయి. స్పీకర్, రాజ్యసభ చైర్మన్ నోటీసులకు అనుమతి ఇస్తే పార్లమెంటులో చర్చ జరుగుతుంది. తొలగించకపోయినా అభి శంసన ఎదుర్కొంటున్న తొలి సీఈసీగా జ్ఞానేష్ కుమార్ అప్రతదిష్ట మూటగట్టుకన్నారు.

### ప్రధాన ఆరోపణలు..

ఓటర్ల జాబితా తయారీ నుంచి ఫలితాల వరకు అక్రమాలు ఉన్నాయని ప్రతిపక్షాలు ఆరోపణ. మహారాష్ట్ర, బిహార్, ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో పొంతన లేని లెక్కలు, 'సర్' పేరుతో లక్షల ఓట్ల తొలగింపు (పశ్చిమ బెంగాల్‌లో) కనిపించాయి. ఎన్నికల సంఘ వెబ్‌సైట్‌లోనే టాలీ నంబర్లు కనిపిస్తున్నాయని ఆధారాలు చూపిం చాయి.

### సీఈసీ నియామకంలో మార్పు..

ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక సీఈసీ నియమక ప్రకియను మార్చింది. గతంలో సీఈసీ ఎంపిక కమిటీలో ప్రధాన మంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండేవారు. కానీ ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక ప్రధాన న్యాయమూర్తిని తప్పించింది. ప్రధాన మంత్రి, కేంద్రంలోని సీనియర్ మంత్రి, ప్రతిపక్ష నేత ఉన్నారు. దీంతో సీఈసీ నియామకం పూర్తిగా అధికార ఎన్డీఏనే చేస్తుంది. మెజారిటీ అధికార పార్టీదే ఉంటుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి తొలగింపునకు కారణాలు కేంద్రం ఇప్పటి వరకు చెప్పలేదు.

### డేటా పరిరక్షణపై సవరణ..

ఎన్నికలు జరిగిన తర్వాత ఎన్నికలకు సంబంధించిన డాటా బహిరంగంగా ఉంచాల్సిన అవసరం లేదని, ప్రతిపక్షాలు అడిగినా ఇవ్వాల్సిన అవసరం లేదని కొత్త సవరణ తీసుకువచ్చింది. ఎన్నికల పారదర్శకత కోసం వీడియో చిత్రీకరణ, వెబ్ కెమెరాలు పెడుతున్నాం. కానీ వాటిని విపక్షాలకు ఇవ్వ కపోతే వాటి ఉపయోగం ఏమిటి విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

### చట్టపరమైన రక్షణ..

సీఈసీ ఏం తప్పు చేసినా విచారణ చేసే అధికారం ఎవరికీ ఉండదు. 78 ఏళ్లుగా లేని ఈ రక్షణ ఇప్పుడు ఎందుకు కల్పించారని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. దీనికి కూడా కేంద్రం సమాధానం చెప్పాలి.

## పేదల పెన్నిధి
# గుత్తా లక్ష్మీనరసింహారెడ్డి

**-సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్టా నగేష్**



**ముద్ర, చిట్యాల:**
నల్గొండ జిల్లా వట్టిమర్తి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు, పేదల పెన్నిధి ప్రజా నాట్య మండలి కళాకారులు గుత్తా లక్ష్మి నర్సింహా రెడ్డి (90) అనారోగ్యంతో మరణించడం పట్ల ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య లు తీవ్ర సంతాపం తెలిపారు. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన లక్ష్మి నర్సింహా రెడ్డి మృతదేహం పై శనివారం ఎర్రజెండా కప్పి, పూల మాలలు వేసి వారు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని అవరోధాలు ఎదురైనా కడవరకు ఎర్రజెండాను వదలని నిజమైన కమ్యూనిస్టు గా లక్ష్మి నర్సింహా రెడ్డి నిలిచారని కొనియాడారు.

అమరజీవి కామ్రెడ్ నర్రా రాఘవరెడ్డి పల్లె సుద్దులు చెప్పే కళాకారుల బృందం తర్వాత మరో కళాకారుల బృందానికి నాయకత్వం వహించిన ప్రజా నాట్య మండలి కళాకారుడిగా వివిధ గ్రామాల్లో కళా ప్రదర్శనలు ఇచ్చిన ప్రజా కళాకారుడు లక్ష్మీ నర్సింహా రెడ్డి అని అన్నారు. వారి ఆశయ సాధన కోసం కృషి చేయడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈలాంటి యోధులను మనం మర్చిపోవద్దన్నారు. వారి మరణం పట్ల తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బొబ్బిలి సుధాకర్ రెడ్డి, రాచకొండ శ్యాం సుందర్, శీలా రాజయ్య, మాజీ ఎంపీటీసీ చింతపల్లి క్రిష్ణయ్య, మాజీ సర్పంచ్ బూరుగు విజయ్ కుమార్, కొంపెల్లి రమేష్, నర్రా బిక్షం రెడ్డి, సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి బూర్గు శ్రీను, కొంపెల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**– 23 నుంచి 25 వరకు**
**ఇందిరా పార్క్‌లో రిలే నిరాహార దీక్షలు**




**ముద్ర, హైదరాబాద్:**
చేనేత కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మార్చి 23, 24, 25 తేదీలలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ చేనేత కార్మిక సంఘం నాయకులు ప్రకటించారు. ఈ దీక్షలను విజయవంతం చేయాలని చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు వనం శాంతికుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సహారా ఎస్టేట్ వద్ద జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రిలే నిరాహార దీక్షల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చేనేత కార్మికుల కోసం ప్రకటించిన "నేతన్న భరోసా" పథకం అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు.

త్రిఫ్ట్ పథకం కింద చేనేత కార్మికులు బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కేవలం రెండు నెలలు మాత్రమే డిపాజిట్ చేసి ఆ తర్వాత కొనసాగించలేదని తెలిపారు. అలాగే జియోట్యాగ్ ఉన్న చేనేత కార్మికుడు మరణిస్తే నేతన్న భీమా ద్వారా రూ.5 లక్షలు ఇవ్వాలని ఉన్నప్పటికీ, మరణించి ఏడాదిన్నర గడిచినా బాధిత కుటుంబాలకు ఇప్పటికీ ఆ సాయం అందలేదని ఆరోపించారు. చేనేత కార్మికులు పోరాటం చేసిన తర్వాతే కార్మికుల రుణమాఫీ అమలవుతోందని, చేనేత సహకార సంఘాలకు కూడా క్యాష్ క్రెడిట్ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిగి దాదాపు 13 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల సహకార వ్యవస్థ కుంచించుకుపోయి అనేక సంఘాలు మూతపడుతున్నాయని తెలిపారు. దీంతో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి వీధిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

అందువల్ల చేనేత సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పథకాల అమలుకు తగిన నిధులు కేటా యించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే 2026–27 రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగా నికి రూ.2000 కోట్లు, టెక్స్‌టైల్ రంగానికి రూ.2000 కోట్లు తప్పకుండా కేటాయించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు అధిక సంఖ్యలో కార్మికులు హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, కార్యదర్శి ముషం నరహరి, సహారా ఎస్టేట్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పెంటయ్య, సహారా ఎస్టేట్ సంక్షేమ సంఘం కోశాధికారి శేఖరయ్యతో పాటు చేనేత నాయకులు రాపోలు విశ్వనాథం, ఏ. మమత జైపాల్, వై. వెంకటేశ్వర్లు, గజం శ్రీశైలం, సీహెచ్ రవి కుమార్, దుస్స కుమార్, కె. రాములు తది తరులు పాల్గొన్నారు.

**ఒత్తిడి తగ్గించుకోండి**

అధిక మానసిక ఒత్తిడి జీర్ణక్రియపై ప్రభావం చూపుతుంది. ధ్యానం లేదా రిలాక్సేషన్ పద్ధతులు ఉపయోగపడతాయి.



## ఖమేనీ ఆచూకీ చెబితే రూ. 92 కోట్ల ప్రైజ్ మనీ

- **ఇరాన్ ప్రజలకు ట్రంప్ బిగ్ ఆఫర్..**
- **అమెరికాలో స్థిరనివాసం కూడా..**

**ముద్ర డెస్క్ :**

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మోజ్తబా ఖమేనీని అమెరికా, ఇజ్రాయిల్ వేటాడుతున్నాయి. ఇప్పటికే, తొలి రోజు దాడిలోనే మాజీ సుప్రీంలీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీని చంపేశారు. ఇప్పుడు, కొత్తగా ఎన్నికైన మోజ్తబాను టార్గెట్ చేస్తున్నారు. మోజ్తబాతో పాటు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కి చెందిన ఇతర సీనియర్ అధికారులను ఇప్పుడు టార్గెట్ చేస్తున్నారు.

ఇదిలా ఉంటే, వీరి ఆచూకీ తెలిపిన వారికి అమెరికా బంఫర్ ఆఫర్ ప్రకటించింది. ఇరాన్ కీలక నేతల సమాచారం ఇచ్చిన వారికి అమెరికా ప్రభుత్వం 10 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 92.47 కోట్లు) రివార్డును ప్రకటించింది. యూఎస్ స్టేట్ డిపార్ట్మెంట్ ''రివార్డ్స్ ఫర్ జస్టిస్'' ప్రోగ్రామ్ ద్వారా ఈ ప్రకటన వెలువడింది. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద కార్యకలాపాలకు ప్లాన్ చేస్తున్న IRGC నాయకులను పట్టుకోవాలని యూఎస్ ప్లాన్ చేస్తోంది. ఇరాన్ ప్రజలు ఈ సమాచారం ఇస్తే వారికి బహుమతితో పాటు అమెరికాలో స్థిరపడేందుకు అవకాశం ఇస్తామని చెప్పింది.

ఇరాన్ సుప్రీం లీడర్ మోజ్తబా ఖమేనీ సుప్రీం లీడర్ కార్యాలయం డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అలీ అస్గర్ హెజాజీ, ఇరాన్ భద్రతా చీఫ్ అలీ లారిజాని వంటి కీలక నేతల్ని అమెరికా కోరుతోంది. మరోవైపు, ఇజ్రాయిల్ అమెరికాలు ఇరాన్‌పై దాడుల్ని తీవ్రం చేస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఇరాన్ లోని టార్గెట్లపై భీకర దాడులు చేస్తామని డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ఒక ఇంటర్వ్యూలో హెచ్చరించారు. మరోవైపు, ఇరాన్ కూడా తన ప్రతీకార దాడుల్ని పెంచింది. ముఖ్యంగా, గల్ఫ్ లోని యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, బహ్రైయిన్, ఖతార్ దేశాలను టార్గెట్ చేస్తోంది. చమురు రవాణాకు కీలకంగా ఉన్న ''హార్ముజ్ జలసంధి''ని మూసేసింది. దీని వల్ల ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం తలెత్తుతోంది.



## మహిళలను కోటీశ్వరులుగా చూడడమే ప్రభుత్వ లక్ష్యం

- **మంత్రి శ్రీధర్ బాబు**

**ముద్ర, కూకట్‌పల్లి:**

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని వసంత నగర్‌లో 'ఇవానియా' బ్యూటీ పార్లర్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు సంకల్పం, పట్టుదలతో స్వయం ఉపాధి రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ఎంతటి పెద్ద ప్రయాణమైనా చిన్న అడుగుతోనే మొదలవుతుందని, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. గతంలో కేవలం సంపన్నులకే పరిమితమైన పెట్రోల్ బంకుల నిర్వహణను, నేడు స్వయం సహాయక సంఘాల ద్వారా మధ్యతరగతి మహిళలకు సైతం అందుబాటులోకి తెచ్చినట్లు బండి రమేష్ గుర్తుచేశారు. ఆర్టీసీ బస్సులను మహిళలే కొనుగోలు చేసి అద్దెకు ఇచ్చేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో కూన శ్రీశైలం గౌడ్, సత్యం శ్రీరంగం, గాలి బాలాజీ, శేరి సతీష్ రెడ్డి మరియు ఇతర పార్టీ నాయకులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## మొదలైన పది పరీక్షలు

- **తొలి రోజు సజావుగా పరీక్ష..**
- **పరీక్ష రాసిన 5,28,239 మంది**
- **తండ్రి మరణించిన దుఖంలో పరీక్షకు హాజరైన ఇద్దరు విద్యార్థులు**
- **ఒకే విద్యార్థి కోసం నాగర్ కర్నూలులో ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు**
- **కూకట్ పల్లి పరీక్ష కేంద్రంలో వివాదం.. అదే స్కూల్.. అక్కడే పరీక్షా కేంద్రం**

**ముద్ర, డెస్క్:**

తెలంగాణలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. అర గంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షలు ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 2,676 కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. పలు కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్‌ది బెస్టు చెబుతూ ఫ్లెక్సీలు వెలిశాయి. పరీక్షల నిర్వహణ కోసం 2,676 పరీక్షా కేంద్రాలు ఏర్పాట్లు చేశారు. ప్రతి విద్యార్థి తన జవాబు పత్రానికి ఓఎంఆర్ షీట్‌ను జత చేయాలి. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తద్వారా పరీక్షల పర్యవేక్షణను మరింత కచ్చితంగా నిర్వహించవచ్చునని అధికారులు తెలిపారు.

**పితృవియోగాన్ని దిగమింగి పరీక్షకు విద్యార్థులు..**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్‌లో హర్షవర్ధన్ అనే విద్యార్థి తన తండ్రి ముందురోజు మృతి చెందినా, ఆ దు:ఖాన్ని దిగమింగుకుని పది పరీక్షకు హాజరయ్యాడు. అలాగే ఖమ్మం జిల్లా కల్లూరు మండలం బత్తులపల్లిలో గండేపల్లి మణికంఠ తండ్రి కొండలరావు శుక్రవారం మృతిచెందినా, పితృ వియోగాన్ని దిగమింగుకొని పరీక్షకు హాజరయ్యాడు.

# యుద్ధం.. రూ.23.44 లక్షల కోట్లు ఆవిరి..

- **పశ్చిమాసియా ఉద్రిక్తతలతో స్టాక్ మార్కెట్లకు రూ.23.44 లక్షల కోట్ల నష్టం**

**ముద్ర డెస్క్ :**




యుద్ధం.. ఆవిరైన లక్షల కోట్ల సంపద. పశ్చిమాసియాలో తలెత్తిన ఉద్రిక్తతలు భారతీయ ఈక్విటీ మార్కెట్లను కుప్పకూల్చాయి. ఇంధన సరఫరా గొలుసుల అంతరాయం.. ద్రవ్యోల్బణ భయాలతో ఇన్వెస్టర్లు బెంబేలెత్తుతుండగా.. స్టాక్ మార్కెట్లలో దాదాపు రూ. 23.44 లక్షల కోట్ల మేర మార్కెట్ విలువ కరిగిపోయింది.

పశ్చిమాసియాలో చెలరేగిన యుద్ధం కేవలం భౌగోళిక సరిహద్దులకే పరిమితం కాలేదు. దీని ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ముఖ్యంగా భారతీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత కొన్ని రోజులుగా మార్కెట్లలో చోటుచేసుకుంటున్న వరుస నష్టాలు, పెట్టుబడిదారుల సంపద కరిగిపోతున్న తీరు దేశ ఆర్థిక వాతావరణంలో తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది.

**రూ. 23.44 లక్షల కోట్ల భారీ నష్టం**

పీటీఐ గణాంకాల ప్రకారం.. పశ్చిమాసియా ఉద్రిక్తతలు మొదలైన తర్వాత బీఎస్ఈ సెన్సెక్స్ సుమారు 5,252 పాయింట్ల (6.46 శాతం) భారీ పతనాన్ని నమోదు చేసింది. ఇది చిన్న మొత్తమేమీ కాదు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టిన సామాన్య, సంస్థాగత ఇన్వెస్టర్ల సంపదలో ఏకంగా రూ. 23.44 లక్షల కోట్ల మేర ఆవిరైపోయింది. సెన్సెక్స్ 30 కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ గతంలో రూ. 463 లక్షల కోట్లుగా ఉండగా ప్రస్తుత పరిణామాలతో అది రూ. 440 లక్షల కోట్లకు దిగజారింది. ఈ అకస్మాత్ పతనం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

**పతనానికి దారితీసిన ప్రధానాంశాలు**

ఈ మార్కెట్ కుదుపునకు కేవలం యుద్ధం మాత్రమే కారణం కాదు.. దాని వెనుక ఉన్న భౌగోళికఆర్థిక పరిణామాలు గొలుసుకట్టు చర్యలలా పనిచేస్తున్నాయి. యుద్ధం వల్ల ఇంధన సరఫరా మార్గాలకు అంతరాయం కలుగుతుందనే భయంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. భారత్ తన చమురు అవసరాల్లో అధిక భాగాన్ని దిగుమతులపైనే ఆధారపడుతుండటంతో ఈ ధరల పెరుగుదల దేశ కరెంట్ అకౌంట్ లోటుపై ప్రభావం చూపుతుంది. తద్వారా ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది. యుద్ధ అనిశ్చితి కారణంగా అంతర్జాతీయంగా డాలర్ బలపడుతోంది. దీని ఫలితంగా రూపాయి విలువ పడిపోవడం.. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్.పీఐలు) మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. వారు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లపై మరింత విక్రయ ఒత్తిడిని పెంచుతోంది. పశ్చిమాసియా ప్రపంచానికి కీలక ఇంధన సరఫరాదారు. అక్కడ యుద్ధం వల్ల ఎల్ఎన్‌జీ వంటి కీలక వనరుల ఉత్పత్తి, రవాణా దెబ్బతినడం గ్లోబల్ ఎనర్జీ మార్కెట్లను అస్థిరతలోకి నెట్టింది.

**భవిష్యత్ దిశ ఏంటి?**

మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం.. యుద్ధ ఉద్రిక్తతలు ఎంతకాలం కొనసాగుతాయనే దానిపైనే మార్కెట్ల భవిష్యత్తు ఆధారపడి ఉంది. జియోపాలిటికల్ ఉద్రిక్తతలు కొనసాగితే మార్కెట్లలో ఒడిదుడుకులు మరికొంతకాలం కొనసాగే అవకాశం ఉంది. అయితే భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయని.. తాత్కాలిక ఒత్తిడిని అధిగమించే సామర్థ్యం దేశానికి ఉందని నిపుణులు భరోసా ఇస్తున్నారు.

దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఇది ఆందోళన కలిగించే అంశమైనప్పటికీ.. మార్కెట్లలోని హెచ్చుతగ్గులను గమనిస్తూ వివేకంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమం. ఏది ఏమైనప్పటికీ యుద్ధ మేఘాలు వీడి అంతర్జాతీయంగా శాంతి వాతావరణం నెలకొంటే తప్ప, గ్లోబల్ మార్కెట్లు కుదుటపడటం కష్టమనేది స్పష్టమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లందరి చూపు ఇప్పుడు పశ్చిమాసియా పరిణామాలపైనే ఉంది.



## ప్యాకేజీ-16 కాలువ పనుల్లో జాప్యంపై మంత్రి ఆగ్రహం


- **మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ముద్ర, వనపర్తి:**

ప్యాకేజీ16 కాలువ పనుల్లో జరిగిన అవకతవకలపై సీఈ, ఎస్ఈ స్థాయి అధికారులను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిలదీశారు. శుక్రవారం సాయంత్రం నీటి పారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో అధికారులపై మంత్రి జూపల్లి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాలువ లైనింగ్, డిస్ట్రిబ్యూషన్ పనుల పురోగతిని సమీక్షించిన ఆయన పనుల్లో నాణ్యత లోపించడం, నిధుల దుర్వినియోగంపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఈ అంశాన్ని రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్యాకేజీ16కు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని వెంటనే అందజేయాలని ఆదేశించిన మంత్రి, త్వరలోనే తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని, ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా పారదర్శకత పాటించాలని ఆదేశించారు. వనపర్తి ఐడీఓసీ కార్యాలయంలో ఏదుల, పాన్ గల్, చిన్నంబావి, వీపనగండ్ల మండలాలకు చెందిన సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీడీఓలు, డీపీఓ, డీఎల్పీఓలతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని హౌసింగ్ పీడీ, ఏఈలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను స్వయంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. గ్రామపంచాయతీలకు వచ్చే నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిధులను ఏ ఏ పనులకు ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేయాలో వివరిస్తూనే, గ్రామాభివృద్ధిలో అధికారుల పాత్ర అత్యంత కీలకమని గుర్తు చేశారు.

## యుద్ధం ఎఫెక్ట్ : పాకిస్థాన్ లో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కట్

**ముద్ర డెస్క్ :**



ఇప్పటికే అంతంతమాత్రంగా ఉన్న ఆర్థిక వ్యవస్థకు.. పశ్చిమాసియా పరిణామాలు తోడవ్వడంతో పాకిస్థాన్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇంధన సంక్షోభంతో సతమతమవుతోంది. దీంతో ప్రధాని షెహబాజ్ షరీఫ్.. మరిన్ని పొదుపు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వరంగ, స్వయం ప్రతిపత్తి సంస్థల ఉద్యోగుల వేతనాల్లో 5 నుంచి 30 శాతం వరకు కోత విధించేందుకు ఆమోదం తెలిపారు. దీని ద్వారా సమకూరే నిధులను ప్రజా సంక్షేమానికే వినియోగిస్తామని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

ఇంధన ధరల హెచ్చుతగ్గుల ప్రభావంతో పాటు ఇటీవల ప్రకటించిన పొదుపు చర్యలను ప్రధాని షరీఫ్ శనివారం సమీక్షించినట్లు పాక్ పీఎంవో తెలిపింది. వివిధ కార్పొరేషన్లు, సంస్థల బోర్డుల్లో సభ్యులుగా ఉన్న ప్రభుత్వ ప్రతినిధులకు ఇకపై పార్టిసిపేషన్ ఫీజు చెల్లింపు ఉండదని సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించింది. క్యాబినెట్ మంత్రులు, సభ్యులు, సలహాదారులు, ప్రత్యేక సహాయకుల రాబోయే రెండు నెలల వేతనాలను కూడా ప్రజాసంక్షేమం కోసం పొదుపు నిధులుగా వినియోగించనున్నట్లు స్పష్టం చేసింది. వీరి విదేశీ పర్యటనలపై విధించిన నిషేధం యథాతథంగా కొనసాగనుంది.

ప్రభుత్వ వాహనాలకు కేటాయించే ఇంధనంలో 50 శాతం కోత విధించాలని, రాబోయే రెండు నెలల పాటు ఈ వాహనాల్లో 60 శాతం వాహనాల వినియోగాన్ని నిలిపివేయాలని ఇటీవల నిర్ణయం తీసుకోగా.. దీని అమలు తీరును థర్డ్ పార్టీ ఆడిట్ పర్యవేక్షిస్తుందని పీఎంవో తెలిపింది. కొత్త వాహనాలు, ఇతర ప్రభుత్వ కొనుగోళ్లపై నిషేధం కొనసాగుతుందని పేర్కొంది.

# యుద్ధం వేళ విదేశీయులకు ఊరట

- **వీసా గడువు మరో 30 రోజులు పెంపు,,**
- **వీసా గడువు ముగిసినా పర్లేదు**
- **నెల రోజులు ఉండేందుకు అనుమతి**
- **జరిమానాలు, శిక్షలు పూర్తిగా రద్దు**
- **యుద్ధం ముగిసిన వెంటనే ఎగ్జిట్ పర్మిట్లు**
- **భారత్ నిర్ణయంపై సర్వత్రా హర్షం**

**ముద్ర డెస్క్ :**




పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల మధ్య భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న భీకర పోరు కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోయి.. భారత్‌లో చిక్కుకుపోయిన విదేశీయులకు భారీ ఊరటనిచ్చింది. దేశంలో ఉన్న విదేశీ పౌరుల వీసా గడువును మరో 30 రోజుల పాటు పొడిగిస్తున్నట్లు కేంద్రం తాజాగా ప్రకటించింది. దుబాయ్‌లోని భారత కాన్సులేట్ విడుదల చేసిన తాజా నోటిఫికేషన్ ప్రకారం.. భారత్‌లో ఉండిపోయిన విదేశీయుల ఈవీసాలు లేదా రెగ్యులర్ వీసాల గడువు ముగిసినా.. వాటిని ఉచితంగా మరో నెల రోజుల పాటు పొడిగించనున్నారు. ఫిబ్రవరి 28వ తేదీ తర్వాత యుద్ధం కారణంగా అనివార్యంగా భారత్‌లో ఉండిపోయిన విదేశీయులకు ఎటువంటి పెనాల్టీలు విధించరు. విమాన రాకపోకలు తిరిగి ప్రారంభమైన తర్వాత.. వారు తమ స్వదేశాలకు వెళ్లడానికి అవసరమైన 'ఎగ్జిట్ పర్మిట్లను' కూడా ఎలాంటి రుసుము లేకుండా జారీ చేస్తారు. ఒకవేళ విదేశీ విమానాలు దారి మళ్లించి భారత్‌కు రావాల్సి వస్తే.. ఆ ప్రయాణికులకు 'టెంపరరీ ల్యాండింగ్ పర్మిట్' కూడా ఉచితంగా ఇస్తారు.

మరోవైపు గల్ఫ్ దేశాల్లో ఉన్న భారత పౌరులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. ఖతార్ గగనతలం పాక్షికంగా మాత్రమే తెరిచి ఉండటంతో పరిమిత సంఖ్యలో విమానాలు నడుస్తున్నాయి. ఖతార్ ఎయిర్‌వేస్ ద్వారా దాదాపు 500 మంది భారతీయులు కొచ్చి సహా ఇతర ప్రాంతాలకు చేరుకున్నారు. పలు కారణాలతో మరణించిన ఇద్దరు భారతీయుల మృతదేహాలను కూడా మానవతా దృక్పథంతో ఖతార్ ఎయిర్‌వేస్ ఉచితంగా స్వదేశానికి చేరవేసింది. మార్చి 14వ తేదీన ముంబైకి ప్రత్యేక విమానాన్ని నడపనున్నట్లు దోహాలోని భారత రాయబార కార్యాలయం తెలిపింది.

యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్ వంటి దేశాల్లోని అమెరికా స్థావరాలు, పౌర మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేస్తోంది. ఈ ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం వాటా ఉన్న హార్మూజ్ జలసంధి ప్రాంతంలో రవాణా స్తంభించడంతో అంతర్జాతీయంగా ధరలు పెరిగే ప్రమాదం కనిపిస్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
15.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**భోజనం చేసిన వెంటనే పడుకోకండి**

భోజనం తర్వాత వెంటనే పడుకుంటే జీర్ణక్రియ మందగిస్తుంది. కనీసం 20–30 నిమిషాలు నడవడం మంచిది.





## సన్‌రైజర్స్ ప్లేయింగ్ ఎలెవన్‌పై సంజయ్ బంగర్ అంచనా

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తన ప్రయాణాన్ని మార్చి 28న ప్రారంభించనుంది. తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ఆ తర్వాత ఏప్రిల్ 2న కోల్‌కతా, ఏప్రిల్ 5న లక్నో, ఏప్రిల్ 11న పంజాబ్ జట్లతో వరుసగా మ్యాచ్‌లు ఆడనుంది. ప్రస్తుతం తొలి విడతకు సంబంధించిన ఈ నాలుగు మ్యాచ్‌ల షెడ్యూల్ మాత్రమే విడుదలైంది.

ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కోచ్ సంజయ్ బంగర్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తుదిజట్టు కూర్పుపై తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. తన అంచనాల ప్రకారం ట్రవిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ టాప్ ఆర్డర్‌లో ఆడతారని చెప్పాడు. నాలుగో స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డిని ఆడించాలన్నది తన అభిప్రాయమని, అతడు టీ20ల్లో మంచి ఫినిషర్‌గా నిలుస్తాడని పేర్కొన్నాడు.

అలాగే హెన్రిచ్ క్లాసెన్‌ను నాలుగో స్థానంలో ఆడించి, నితీశ్‌ను ఐదో స్థానంలో పంపే అవకాశమూ ఉందని బంగర్ చెప్పాడు. గత సీజన్‌లో అనికేత్ వర్మ మంచి ప్రదర్శన కనబరిచాడని, ముఖ్యంగా స్పిన్నర్లపై భారీ షాట్లు ఆడగల సామర్థ్యం ఉందని పేర్కొన్నాడు. అతడిని ఆరో లేదా ఏడో స్థానంలో ఆడించవచ్చని సూచించాడు.



## ఆర్సీబీ కొనుగోలుకు భారీ బిడ్‌లు.. స్వీడన్ సంస్థ ఆసక్తి

ఐపీఎల్‌లో ప్రముఖ జట్లలో ఒకటైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీని కొనుగోలు చేయడానికి విదేశీ పెట్టుబడి సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. స్వీడన్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఈక్వ్యూటీ గ్రూప్ ఆర్సీబీని దక్కించుకోవడానికి సుమారు రూ.16 వేల కోట్ల నుంచి రూ.17 వేల కోట్ల వరకు బిడ్ వేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన బిడ్ల దాఖలు చేయడానికి చివరి తేదీ మార్చి 16గా నిర్ణయించారు. ప్రస్తుతం ఆర్సీబీ ఫ్రాంచైజీ యాజమాన్యం యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ మాతృసంస్థ దయాజియోకు చెందింది. అయితే 2025 నవంబర్‌లో రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో తమ వాటాను విక్రయించాలనే నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీ కొనుగోలుకు దాదాపు తొమ్మిది నుంచి పది మంది పెట్టుబడిదారులను షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. సీరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈఓ అదార్ పూనావాలా, మణిపాల్ గ్రూప్ ఛైర్మన్ రంజన్ పాయ్, ఈక్వ్యూటీ గ్రూప్, లాన్సర్ క్యాపిటల్ వంటి సంస్థలు ఈ రేసులో ఉన్నట్లు సమాచారం

## రనౌట్ వివాదం.. సల్మాన్ అఘాపై ఐసీసీ చర్య



పాకిస్థాన్-బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగిన రెండో వన్డేలో చోటుచేసుకున్న రనౌట్ ఘటన క్రికెట్ ప్రపంచంలో చర్చకు దారి తీసింది. కొందరు ఇది క్రీడాస్ఫూర్తికి విరుద్ధమని విమర్శిస్తుండగా, మరికొందరు మ్యాచ్ గెలవడమే లక్ష్యంగా జట్లు ఆడుతాయని అంటున్నారు. అయితే మైదానంలో అసహనంగా ప్రవర్తించినందుకు పాకిస్థాన్ ఆటగాడు సల్మాన్ అఘాపై అంతర్జాతీయ క్రికెట్ మండలి చర్యలు తీసుకుంది. ఔట్‌గా ప్రకటించగానే అఘా తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. హెల్మెట్, బ్యాట్ వంటి పరికరాలను మైదానంలోనే విసిరివేయడంతో మ్యాచ్ రిఫరీ నీయమూర్ రషీద్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఐసీసీ, లెవల్-1 నిబంధనల ఉల్లంఘనగా భావించి అతడి ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ నమోదు చేసింది. క్రికెట్ పరికరాలను అగౌరవపరిచినట్లుగా అఘాపై ఫిర్యాదు వచ్చినట్లు ఐసీసీ తెలిపింది. మైదానంలో అతడు హెల్మెట్, గ్లోవ్స్, బ్యాట్‌ను విసిరేసిన విషయం నిర్ధారణ అయిందని పేర్కొంది. గతంలో అఘా నుంచి ఇలాంటి ప్రవర్తన కనిపించలేదని, అయినప్పటికీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నామని స్పష్టం చేసింది.

## నమన్ అవార్డులు ప్రకటించిన బీసీసీఐ.. ద్రవిడ్, బిన్నీ, మిథాలీకి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్

భారత క్రికె లో ప్రతి సంవత్సరం అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు అందించే ప్రతిష్టాత్మక నమన్ అవార్డులను బీసీసీఐ ప్రకటించింది. 2024-25 సీజన్‌కు సంబంధించిన తుది జాబితాను అధికారికంగా విడుదల చేసింది. ఈసారి టీమ్ ఇండియా మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, భారత మహిళా జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌లకు సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించారు. టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు పాలీ ఉమ్రిగర్ అవార్డు లభించింది. రోజర్ బిన్నీ భారత క్రికెట్ చరిత్రలో కీలక పాత్ర పోషించిన ఆటగాడు. 1983 వన్డే ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యుడైన ఆయన ఆ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఓపెనింగ్ బౌలింగ్‌తో పాటు ఓపెనింగ్ బ్యాటింగ్ చేసిన తొలి భారత క్రికెటర్‌గా కూడా ఆయన గుర్తింపు పొందాడు. అండర్-19 జట్టుకు కోచ్‌గా సేవలందించిన ఆయన మూడు సంవత్సరాలు బీసీసీఐ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. రాహుల్ ద్రవిడ్ భారత క్రికెట్‌లో అత్యంత గౌరవనీయమైన ఆటగాళ్లలో ఒకరు. కెప్టెన్‌గా, తరువాత ప్రధాన కోచ్‌గా జట్టుకు సేవలందించారు. ఆయన మార్గదర్శకత్వంలో భారత అండర్-19 జట్టు 2018 ప్రపంచకప్ గెలిచింది. 2021 నుంచి 2024 వరకు టీమ్ ఇండియా ప్రధాన కోచ్‌గా పనిచేసిన ద్రవిడ్ కాలంలో భారత జట్టు టీ20 ప్రపంచకప్‌ను దక్కించుకుంది. టెస్టులు, వన్డేల్లో పదివేలకు పైగా పరుగులు చేసిన అరుదైన బ్యాటర్లలో ఆయన ఒకరు. హైదరాబాద్‌కు చెందిన మిథాలీ రాజ్ మహిళా క్రికెట్‌లో అత్యంత ప్రభావవంతమైన ఆటగాళ్లలో ఒకరు. 1999 నుంచి 2022 వరకు అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగిన ఆమె వన్డేల్లో 7,805 పరుగులు చేసి మహిళా క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచింది. భారత మహిళా జట్టుకు దీర్ఘకాలం నాయకత్వం వహించిన మిథాలీని అభిమానులు 'లేడీ టెండూల్కర్'గా కూడా పిలుస్తారు. ఇతర అవార్డుల్లో అంతర్జాతీయ ఉత్తమ పురుష క్రికెటర్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు. అంతర్జాతీయ ఉత్తమ మహిళా క్రికెటర్ అవార్డు స్మృతి మంధానకు లభించింది. పురుషుల విభాగంలో ఉత్తమ అంతర్జాతీయ డెబ్యూ క్రికెటర్‌గా హర్షిత్ రాణా ఎంపికయ్యాడు. మహిళల విభాగంలో ఈ అవార్డు శ్రీ చరణికి దక్కింది. వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్‌గా స్మృతి మంధాన, అత్యధిక వికెట్లు తీసిన మహిళా క్రికెటర్‌గా దీప్తి శర్మ నిలిచారు. దేశీయ క్రికెట్‌లో ఉత్తమ అంపైర్‌గా ఉల్హాస్ గంధే ఎంపిక కాగా, బీసీసీఐ డొమెస్టిక్ టోర్నమెంట్స్‌లో ఉత్తమ ప్రదర్శన చేసిన జట్టుగా ముంబయి గుర్తింపు పొందింది.



## పాకిస్తాన్ ఆటగాడి వరల్డ్ రికార్డు



ఢాకాలో జరిగిన రెండో వన్డేలో పాకిస్తాన్ యువ ఆటగాడు మాజ్ సదాకత్ అద్భుత ప్రదర్శనతో ప్రపంచ రికార్డు సృష్టించాడు. బంగ్లాదేశ్‌పై జరిగిన ఈ మ్యాచ్‌లో బ్యాట్, బంతితో రాణించి జట్టుకు ఘన విజయం అందించాడు. మొదట ఓపెనర్‌గా బరిలోకి దిగిన సదాకత్ దూకుడుగా ఆడుతూ 46 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 75 పరుగులు చేశాడు. తర్వాత బౌలింగ్‌లో కూడా మూడు కీలక వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో అతడికి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

ఈ మ్యాచ్ ద్వారా సదాకత్ అరుదైన ఘనత సాధించాడు. బంగ్లాదేశ్‌పై వన్డే మ్యాచ్‌లో అర్ధశతకం సాధించి మూడు వికెట్లు తీసిన అత్యంత పిన్న వయస్కుడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. కేవలం 20 సంవత్సరాలు 302 రోజుల వయసులోనే ఈ ఫీట్ సాధించాడు. ఇంతకుముందు ఈ రికార్డు వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉండేది. తాజా ప్రదర్శనతో సదాకత్ ఆ రికార్డును అధిగమించాడు. అలాగే ఒకే వన్డే మ్యాచ్‌లో అర్ధశతకం, మూడు వికెట్లు సాధించిన ప్రపంచ క్రికెట్‌లో 14వ ఆటగాడిగా కూడా నిలిచాడు.



## ఐపీఎల్‌కు ముందు కేకేఆర్‌కు షాక్.. హర్షిత్ రాణా దూరం?


ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. జట్టు యువ పేసర్ హర్షిత్ రాణా ఈ సీజన్‌కు దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. టీ20 ప్రపంచకప్‌కు ముందు దక్షిణాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్ సందర్భంగా హర్షిత్ రాణా మోకాలి గాయానికి గురయ్యాడు. ఆ తర్వాత అతడు శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదని తెలుస్తోంది. అయితే ఈ విషయంపై కోల్‌కతా ఫ్రాంచైజీ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.జట్టుకు చెందిన ఒక అధికారి తెలిపిన వివరాల ప్రకారం, హర్షిత్ రాణా ఈ సీజన్‌లో అందుబాటులో ఉండకపోవచ్చని తెలుస్తోంది. అతడు దూరమైతే జట్టులోని ఇతర పేసర్లు వైభవ్, ఉమ్రాన్, కార్తిక్, ఆకాశ్‌లకు ఆడే అవకాశం లభించే అవకాశముంది. ఇప్పటివరకు హర్షిత్ రాణా స్థానంలో కొత్త ఆటగాడిని జట్టులోకి తీసుకునే విషయంపై కోల్‌కతా మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. దీంతో కేకేఆర్ తదుపరి నిర్ణయంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
15.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews




## సమయానికి భోజనం చేయండి

అసమయంగా తినడం జీర్ణక్రియను దెబ్బతీస్తుంది. క్రమబద్ధమైన సమయానికి భోజనం చేయడం గ్యాస్ సమస్యను తగ్గిస్తుంది.




# బ్యాక్‌లెస్ గౌన్‌లో అవ్నీత్ కౌర్ గ్లామర్ షో



యువ నటి అవ్నీత్ కౌర్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోల్లో బ్లాక్ బ్యాక్‌లెస్ గౌన్‌లో కనిపిస్తూ గ్లామర్‌ను మరింత ఎలివేట్ చేసింది. స్టైలిష్ పోజ్‌తో కెమెరాకు ఎదురుగా నిలిచిన ఆమె లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ ఫోటోషూట్‌లో అవ్నీత్ మినిమల్ మేకప్‌తో నేచురల్ బ్యూటీని హైలైట్ చేసింది. బ్యాక్‌లెస్ డిజైన్ గౌన్ ఆమె స్టైలింగ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లైట్ మేకప్, సింపుల్ హెయిర్ స్టైల్‌తో ఎలిగెంట్‌గా కనిపించింది. ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా అభిమానులు కామెంట్లతో ప్రశంసలు కురిపిస్తున్నారు. అవ్నీత్ ఫ్యాషన్ సెన్స్ మరోసారి నెటిజన్లను ఆకట్టుకుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో భారీగా ట్రెండ్ అవుతున్నాయి.

# ఆస్కార్ వేడుకలో సీట్ ఫిల్లర్స్ కి ప్రత్యేక నిబంధనలు




ప్రపంచ సినీ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డుల వేడుకకు ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఈ వేడుకలో సెలబ్రిటీలతో పాటు కొంతమంది సాధారణ వ్యక్తులు కూడా హాజరవుతారు. వీరిని 'సీట్ ఫిల్లర్స్'గా పిలుస్తారు. సినీ రంగానికి సంబంధించిన వారు లేదా సినిమా మీద ఆసక్తి ఉన్నవారికి మాత్రమే ఈ అవకాశాన్ని ఇస్తారు.

వేడుక జరుగుతున్న సమయంలో హాల్ ఎప్పుడూ నిండుగా కనిపించేందుకు ఈ సీట్ ఫిల్లర్స్‌ను ఆహ్వానిస్తారు. సెలబ్రిటీలు మధ్యలో బయటకు వెళ్లినా లేదా విరామం తీసుకున్నా, వారి సీట్లలో ఈ సీట్ ఫిల్లర్స్‌ను కూర్చోబెడతారు. ఇటీవల గ్రామీ అవార్డ్స్‌కు సీట్ ఫిల్లర్‌గా వెళ్లిన ఒక కంటెంట్ క్రియేటర్ అక్కడ పాటించే నియమాల గురించి చెప్పడంతో ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది.

సీట్ ఫిల్లర్స్‌కు కొన్ని కఠినమైన నిబంధనలు ఉంటాయి. వారు ప్రయాణం లేదా ఇతర వ్యక్తిగత ఖర్చులు అన్నీ తమ ఖర్చుతోనే భరించాలి. కార్యక్రమం జరుగుతున్న సమయంలో మొబైల్ ఫోన్లు వాడేందుకు అనుమతి ఉండదు. డాల్బీ థియేటర్‌లోకి ప్రవేశించే ముందు ఫోన్లను బయటే అప్పగించాల్సి ఉంటుంది.

అంతేకాదు, వేడుక మధ్యలో తినడం లేదా నీళ్లు తాగడం కూడా వీరికి అనుమతి ఉండదు. కార్యక్రమానికి నిర్ణయించిన డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలి. అలాగే సెలబ్రిటీలు ముందుగా మాట్లాడితే తప్ప సీట్ ఫిల్లర్స్ వారు వారితో సంభాషించకూడదు.

అయినా సరే ఆస్కార్ వంటి ప్రతిష్టాత్మక వేడుకకు ప్రత్యక్షంగా హాజరయ్యే అవకాశం రావడం కూడా చాలా అరుదని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.



# ఉస్తాద్ భగత్ సింగ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఖరారు

పవన్ కళ్యాణ్ అభిమానులకు మరో ఆనంద వార్త వచ్చింది. ఆయన హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీని చిత్ర బృందం ప్రకటించింది.

ఈ వేడుక మార్చి 15న హైదరాబాద్‌లోని పోలీస్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానుందని చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఈ సందర్భంగా అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని సూచించింది.

దర్శకుడు హరీశ్ శంకర్ కూడా ఈ ఈవెంట్ గురించి స్పందిస్తూ, ఈసారి వేడుక ఘనంగా జరగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు కూడా స్పష్టం చేశారు.


ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'గబ్బర్ సింగ్' తర్వాత పవన్ కళ్యాణ్ – హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం కావడంతో అభిమానుల్లో ఉత్సాహం ఎక్కువగా ఉంది.



## రవి మోహన్ వ్యాఖ్యలపై భార్య ఆర్తి స్పందన

కోలీవుడ్ నటుడు రవి మోహన్ (జయం రవి) ఇటీవల తనపై వచ్చిన ట్రోల్స్ గురించి స్పందిస్తూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మహిళలే ఎప్పుడూ సరైనవారిగా భావిస్తారని, కానీ చాలా సందర్భాల్లో నిజమైన బాధితులు పురుషులేనని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన భార్య ఆర్తి రవి తాజాగా సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ఆమె తన పోస్టులో ఒక ఉదాహరణను ప్రస్తావిస్తూ ప్రశ్నించారు. విడాకులు రాకముందే తాను మరో వ్యక్తితో కలిసి ఉంటే సమాజం దాన్ని అంగీకరించేదా అని ఆమె అడిగారు. మహిళలు బాధితులని చెప్పడం అందరూ అంగీకరిస్తారని, కానీ అదే పరిస్థితిలో ఒక పురుషుడు అలాంటి పనులు చేస్తూ తానే బాధితుడినని చెప్పుకుంటే ఎందుకు ప్రశ్నించకూడదని ఆమె వ్యాఖ్యానించారు. అలా తిరగడం గర్వపడే విషయం కాదని, అది అసహ్యకరమైన ప్రవర్తన అని ఆమె స్పష్టం చేశారు. రవి మోహన్ 2024లో తన భార్య ఆర్తితో విడిపోతున్నట్లు ప్రకటించారు. ఆ సమయంలో గాయని కెనీషాతో ఆయన రిలేషన్‌లో ఉన్నారనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా రవి మోహన్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ప్రారంభోత్సవానికి కెనీషా హాజరుకావడంతో ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# ధురంధర్ 2 లో అవకాశం కోల్పోయిన స్టార్ హీరో



ప్రపంచవ్యాప్తంగా సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'ధురంధర్ 2'. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమాలో ఒక ముఖ్యమైన అతిథి పాత్రలో నటించే అవకాశం తనకు వచ్చినప్పటికీ, దాన్ని వదులుకోవాల్సి వచ్చిందని బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ తెలిపారు.

ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, ఆ పాత్ర కోసం దర్శకుడు తనను సంప్రదించారని చెప్పారు. తాను కూడా ఆ సినిమాలో నటించాలని అనుకున్నానని, కానీ అప్పటికే మరో చిత్రానికి డేట్స్ ఇచ్చేయడంతో ఆ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందన్నారు. ఒక దర్శకుడికి ఇచ్చిన మాటను మార్చి మరో సినిమా అంగీకరించడం సరైంది కాదని, వృత్తి పట్ల నిబద్ధత వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. భవిష్యత్తులో ఆదిత్య ధర్ దర్శకత్వంలో నటించే అవకాశం రావాలని ఆశిస్తున్నట్లు వెల్లడించారు.

**అడ్వాన్స్ బుకింగ్స్‌లో 'ధురంధర్ 2' దూకుడు**

'ధురంధర్' మొదటి భాగం సూపర్ హిట్ కావడంతో రెండో భాగంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. విడుదలకు ముందే ఈ చిత్రం అడ్వాన్స్ బుకింగ్స్‌లో మంచి స్పందన పొందుతోంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com